₹40

జూలై - 2024

# బాల చెలిమి

పిల్లల వికాస పత్రిక

**BALA CHELIMI**

Telugu Children's Monthly Magazine

సంపుటి : 33 • సంచిక : 10

JULY - 2024



Editor : **Er. VEDAKUMAR MANIKONDA**

A PUBLICATION OF **CHILDREN'S EDUCATIONAL ACADEMY,** HYDERABAD, TELANGANA

# చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ

హైదరాబాద్ (Regd. 720/1982)

బాల చెలిమి
పిల్లల వికాస పత్రిక

## తెలంగాణ బడి పిల్లల కథలు



**10 పుస్తకాల సెట్ ధర రూ.330 • తగ్గింపు ధర రూ. 300**

పిల్లలకు అత్యంత ఆనందానిచ్చేది ఆట బొమ్మలు, కథల పుస్తకాలే. పాఠ్యపుస్తకాలు అందించే జ్ఞానానికి సమాంతరంగా మరెంతో లోకజ్ఞానాన్ని అందించేది బాల సాహిత్యమే. పుస్తకాలు పిల్లల ఆలోచనా నైపుణ్యాలను పెంచుతాయి. వారి ఊహలకు ప్రాణం పోస్తాయి. వారిలో సృజనాత్మకతను పెంచుతాయి. చరిత్ర, సంస్కృతి, కళలు, సైన్స్, మానవ స్వభావాలు, జంతు స్వభావాలు, ఆరోగ్య సంబంధిత అంశాలు - ఒకటేమిటి ప్రాథమిక విజ్ఞానఖని బాలసాహిత్యం, పిల్లలో నైతికతను, ఆధ్యాత్మికతను, సక్రమమైన ప్రవర్తనను, మంచి చెడుల అవగాహనను పెంచే బాధ్యతను బాలసాహిత్యమే నెరవేర్చగలదు.

ఇవి అచ్చంగా మన పిల్లలు రాసిన కథలు, స్వచ్ఛమైన కథలు. 'చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ' తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల **"బడి పిల్లల కథలు"** సంకలనాలుగా అందమైన బొమ్మలతో గతంలో వెలువరించింది. అవి రెండు తెలుగు రాష్ట్రాల్లోనూ విశేష ఆదరణ పొందాయి.

అలాగే ఇప్పుడు పిల్లలకోసం తెలంగాణలోని ఉమ్మడి పది జిల్లాల బాల సాహిత్య రచయితలు రాసిన **"పెద్దలు రాసిన పిల్లల కథలు"** పది సంకలనాలను అందమైన బొమ్మలతో వెలువరించింది. చిన్నారులు, పెద్దలు, సాహితీ వేత్తలు ఎప్పటివలె ఈ పుస్తకాలను ఆదరిస్తారని ఆశిస్తున్నాం.

-మణికొండ వేదకుమార్
చైర్మన్, చిల్డ్రన్స్ ఎడ్యుకేషన్ అకాడమీ

## పెద్దలు రాసిన పిల్లల కథలు (ఉమ్మడి పది జిల్లాలు)



**10 పుస్తకాల సెట్ ధర రూ.350 • తగ్గింపు ధర రూ. 300**



ప్రతులకు

అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు. మరియు
'భూపతి సదన్' 3-6-716, స్ట్రీట్ నెం.12,
హిమాయత్‌నగర్, హైదరాబాద్-500029
ఫోన్ : 9030 6262 88
*email: edit.chelimi@gmail.com* *website : www.balachelimi.com*



## చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించిన ఇతర పుస్తకాలు




బాలచెలిమి
పిల్లల వికాస పత్రిక
# BALA CHELIMI
Telugu Children's Monthly Magazine

సంపుటి: 33 Volume: 33 | సంచిక : 10 Issue : 10 | హైదరాబాద్ Hyderabad | జులై July | పేజీలు 52 Pages | రూ. ₹. 40

## లోపలి పేజీల్లో.......







మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే.. ........ మణికొండ వేదకుమార్... ........ 5
చార్లెస్ బాబేజ్ ........ బాలచెలిమి డెస్క్ ........ 6
కోతి రాయబారం (కథ) ........ భైతి దుర్గయ్య ........ 7
అనితా పాల్‌దురై ........ షీరోస్-256........ 9
కష్టమైన అక్షరాలు ఇష్టంగా! (అక్షరం)........ వై. మల్లికార్జున రావు ........ 10
బంగారు చేప (కథ)........ ఎన్. శివాని........ 11
తికమక (కథ) ........ ఎం.ఎన్. జయంత్ కుమార్ ........ 12
పంది - తోడేలు (కథ) ........ లియో టాల్ స్టాయ్ ........ 13
గురువు చెప్పిన కథ (కథ)........ అనగ........ 14
గుంపులో బంతి (ఆట) ........ ఆటలంటే మాకిష్టం ........ 15
సుల్తాన్ మురాట్ (కథ) ........ చింగీజ్ ఐత్‌మాతోవ్ ........ 16
అమరావతి (యాత్ర)........ జుగాష్ విలి........ 19
జై విజ్ఞాన్ (నాటిక)........ డా॥ కాసర్ల నరేశ్‌రావు........ 20
ఎవరు గొప్ప (కథ)........ పైడిమర్రి రామకృష్ణ........ 23
స్ఫూర్తిదాతలు కడలి కెరటాలు (కవిత) ........ గద్వాల సోమన్న........ 24
నక్క అత్యాశ ........ పంచతంత్ర కథలు ........ 24
వేప చెట్టు (చెట్టు - చేమ)........ కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి........ 25
గాలిలో గమ్మత్తు (కార్టూన్) ........ చొక్కాపు వెంకటరమణ ........ 26
పాటలు........ పిల్లల పాటల పరిమళం ........ 28
రాళ్ళు కొట్టే మనిషి కథ (కథ)........ అనిల్ బత్తుల ........ 29
కాగితంలో నీళ్ళు మరిగించడం (సైన్స్)........ డాక్టర్ మహీధర నళినీ మోహన్ ........ 31

దుష్టులకు దూరంగా ఉండు (కథ)........................
పండు – గుండు (గేయం) ................................
మరో యాదగిరి... మత్స్యగిరి (విహార స్థలాలు) ..........
చెలిమి క్లబ్.................................................
మామిడి చెట్టు మూడు కొమ్మలు (కథ)....................
దేశమును ప్రేమించుమన్నా (దేశభక్తి గీతం) ..............
కలం చెలిమి ...............................................
విభిన్న వైద్యాలు (ఆరోగ్యం – విజ్ఞానం)..................
రాళ్ళాట (నేర్చుకుందామా) ................................
అలనాటి చందమామ కథలు (పుస్తక సమీక్ష).............
పెలికాన్ (పక్షి)..............................................
ఆడుతూ పాడుకుందాం ......................................
మానవత్వం (వ్యాసం).. .....................................
అంతరిక్ష విజ్ఞానం (జి.కె.)................................
పిచ్చుక పిల్ల (కథ).........................................
పుస్తక పరిచయం............................................
సమాచారం .................................................
నేనూ నా బాల్యం – తురగా జానకీ రాణి (వ్యక్తిత్వం).....
డి. ఆకాంక్ష ................................ 32
ఎం. హరికిషన్ ............................. 34
డా. ద్యావనపల్లి సత్యనారాయణ ............ 35
బాలచెలిమి ................................ 36
జూపూడి జిగీశ ............................. 37
రాయప్రోలు సుబ్బారావు ................... 39
బాలచెలిమి ................................39
తెలంగాణ సారస్వత పరిషత్తు, ............ 40
బాలచెలిమి ................................ 41
యాదవరం చంద్రకాంత్ గౌడ్ ............. 42
బాలచెలిమి ................................ 43
బాలచెలిమి ................................ 44
టి. హన్సిక................................. 45
తెలంగాణ సారస్వత పరిషత్ ............... 46
యు. బాల్‌రాజ్.............................. 47
బాలచెలిమి ................................ 47
సచిన్ కోత్వాల్.............................. 48
తురగా వసంత శోభ........................ 50



# చెలిమి లేఖలు

బాలచెలిమి పత్రిక పునఃప్రారంభం సంతోష దాయకం. ప్రతి సంచిక కథలతో, పాటలతో, జోక్స్‌తో, సామెతలతో, పద్యాలతో పిల్లల అభిరుచి పెంచే విధంగా పత్రికను తీర్చిదిద్దుతున్నందుకు ధన్యవాదాలు.

**సారంగపాణి**

హన్మకొండ

పుస్తకాలు చదవడం, కథలు రాయడం, కవిత్వం రాయడం, బొమ్మలు వేయడం, పుస్తకాలు చదవడం అంటే చాలా ఇష్టం. కథల పుస్తకాలు అంటే ఇంకా ఇష్టం.

**చింతకుంట్ల గీతిక**

జార్లపాలెం విలేజ్ కొండేపి మండలం ప్రకాశం జిల్లా ఆంధ్ర ప్రదేశ్

నాకు తెలుగు అంటే ఇష్టం. రవి సారు మాకు వ్యాసాలు, కథలు, కవితలు ఎలా రాయాలో శిక్షణ ఇవ్వడం జరిగింది. మా పాఠశాలలో జరిగే పోటీలలో నన్ను చాలా ప్రోత్సహిస్తారు.

**ఆర్. భవిత**

10వ తరగతి, జి.ప.బాలికల పాఠశాల, సిరిసిల్ల

నమస్తే మిత్రులారా.. నాకు కథలు రాయడమంటే చాలా ఇష్టం. పుస్తకాలు చదవడం అంటే ఇంకా ఇంకా ఇష్టం. పుస్తక పఠనంతో మనిషి మేధస్సు పెరుగుతుంది. వీసా లేకుండా ప్రపంచాన్ని చుట్టి రావాలంటే అది కేవలం పుస్తకంతోనే సాధ్యం. పుస్తకాలు చదివే వారికి త్వరగా మతిమరుపు రాదని పెద్దలంటారు...

**ఆర్.మంజుల**

8వతరగతి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, పోలకల్, కర్నూలు

Student of OGS
Pic by :
టి. స్వామి

బొమ్మలు:
కూరెళ్ల శ్రీనివాస్
m : 98495 43728




సంపాదకులు : మణికొండ వేదకుమార్

BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2, St.No.12, Himayatnagar,
Hyderabad - 500 029.
e-mail : edit.chelimi@gmail.com, www.balchelimi.com
Mob: 98480 44713

# మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే...

ఈసారి ఋతుపవనాలు ముందుగానే వచ్చాయి. విస్తారంగా వర్షాలు పడుతున్నాయి. రోడ్లన్నీ నదుల్లా మారుతున్నాయి. డ్రైనేజీ వాటర్ పొంగి పొర్లుతుంది. పరిసరాలన్నీ చెత్తా చెదారంతో నిండిపొయ్యాయి. తాగునీరు కలుషితంగా మారుతున్నది. వాతావరణాన్ని తేమ, చల్లదనం, ముక్కవాసన ముసురులా కమ్ముకుంటున్నాయి. ఈ వాతావరణం ముఖ్యంగా పిల్లల, వృద్ధుల అనారోగ్యానికి కారణమవుతున్నది. డయోరియా, డెంగూ వంటి వ్యాధులు ప్రబలుతున్నాయి.

పిల్లలూ... ఈ సమయంలో మీరు కొన్ని జాగ్రత్తలు పాటించాలి. వర్షంలో తడవకూడదు. తడిస్తే వెంటనే తల తుడుచుకోవాలి. వేడి నీళ్లతో స్నానం చేసి శుభ్రమైన ఉతికిన పొడి బట్టలు వేసుకోవాలి. వేడి వేడి అన్నం, కూరలు తినాలి. గోరువెచ్చటి నీటిని తాగాలి. ఫ్రిజ్‌లో ఉంచినవేవి తినకపోవడం, తాగకపోవడం మంచి పని. ఈ తేమ వాతావరణం వల్ల ఈగలు, దోమలు, ఇతర కీటకాలు ఆహార పదార్థాల మీద, వస్తువుల మీద వాలుతుంటాయి. అందువల్ల బయట తిళ్లు అవైడ్ చెయ్యాలి. చేతులు కడుక్కుంటూ ఉండాలి. ఇంట్లో ప్రతి వంట మీద సరైన మూతలు పెట్టాలి. పక్క దుప్పట్లు కూడ తేమ లేకుండా డ్రైగా ఉండేలా చూసుకోవాలి.



ఈ వాతావరణం మనస్సునీ, బుద్ధినీ నిరుత్సాహంగా, బద్ధకంగా, అనీజీగా మారుస్తుంది. మంచి పుస్తకాలు చదవడం ద్వారా, అమ్మానాన్నలతో స్నేహితులతో కబుర్లు చెప్పుకోవడం ద్వారా, ఉల్లాసాన్నిచ్చే ఇంట్లో ఆటల ద్వారా మిమ్మల్ని మీరే ఉత్సాహపరుచుకోవాలి.

ఈ రెండు నెలలూ వర్షాలు ఇలాగే ఉంటాయి. జాగ్రత్తలు పాటించండి. మీ ఆరోగ్యం మీ చేతుల్లోనే... మరవకండేం...

అలా అని వర్షాన్నీ, వర్షంలోని అందాన్నీ, మట్టి వాసనని, వర్షం చప్పుడు ఇచ్చే ఆనందాన్నీ, కాగితప్పడవల ఆటనీ మిస్సవకండి...

వేదకుమార్.యం

(మణికొండ వేదకుమార్)

ఎడిటర్ బాలచెలిమి





సైంటిస్ట్

# చార్లెస్ బాబేజ్

బాబేజ్ ఒక బ్రిటీష్ గణిత శాస్త్రజ్ఞుడు, వినూత్న ఆలోచనాపరుడు, కంప్యూటింగ్ మార్గదర్శకుడు.

చార్లెస్ బాబేజ్ 26 డిసెంబర్ 1791న లండన్‌లో ఒక బ్యాంకర్ కొడుకుగా జన్మించాడు. అతను చిన్నతనంలో తరచుగా అనారోగ్యంతో ఉన్నాడు. ప్రధానంగా ఇంట్లోనే చదువుకున్నాడు. అతను 1810లో కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి వెళ్ళే సమయానికి గణితంపై చాలా ఆసక్తిని కలిగి ఉన్నాడు.

గ్రాడ్యుయేషన్ తర్వాత బాబేజ్‌ను రాయల్ ఇన్‌స్టిట్యూషన్‌లో కాలిక్యులస్‌పై లెక్చర్ చేయడానికి నియమించారు. రెండు సంవత్సరాలలో అతను రాయల్ సొసైటీకి సభ్యునిగా ఎన్నికయ్యాడు. అతని కేంబ్రిడ్జ్ స్నేహితులతో కలిసి 1820లో ఆస్ట్రోనామికల్ సొసైటీని స్థాపించడంలో కీలకపాత్ర పోషించాడు, రాయల్ సొసైటీ ఆధిపత్యాన్ని సవాలు చేసిన మొదటి వ్యక్తి. 1828 నుండి 1839 వరకు, బాబేజ్ కేంబ్రిడ్జ్‌లో లుకాసియన్ గణితశాస్త్ర ప్రొఫెసర్‌గా ఉన్నారు.

1820వ దశకంలో బాబేజ్ తన 'డిఫరెన్స్ ఇంజిన్'పై గణిత గణనలను నిర్వహించగల ఒక యంత్రంపై పనిచేశాడు. ప్రారంభంలో ఆరు చక్రాల నమూనా నిర్మించబడింది. అనేక మంది ప్రేక్షకులకు ప్రదర్శించబడింది. మెరుగైన, యంత్రం - డిఫరెన్స్ ఇంజిన్ 2 కోసం ప్రణాళికలను అభివృద్ధి చేశాడు. అతను ఒక ఆవిష్కరణ, మరింత సంక్లిష్టమైన విశ్లేషణాత్మక ఇంజిన్, ఒక విప్లవాత్మక పరికరం, కంప్యూటర్ మార్గదర్శకుడిగా అతని కీర్తి ఇప్పుడు ఎక్కువగా నిలిచిపోయింది. ఇది సూచనలను అందించే పంచ్ కార్డులను ఉపయోగించి ఏదైనా అంకగణిత గణనను నిర్వహించడానికి ఉద్దేశించబడింది, అలాగే నేటి కంప్యూటర్‌లలో సంఖ్యలు, అనేక ఇతర ప్రాథమిక భాగాలను నిల్వ చేయడానికి మెమరీ యూనిట్. విశేషమైన బ్రిటీష్ గణిత శాస్త్రజ్ఞుడు అడా లవ్‌లేస్ విశ్లేషణాత్మక ఇంజిన్ కోసం ఒక ప్రోగ్రామ్‌ను పూర్తి చేశాడు, కానీ డిఫరెన్స్ ఇంజిన్ 2 బాబేజ్ జీవితకాలంలో పూర్తి కాలేదు. బాబేజ్ తత్వశాస్త్రం, కోడ్-బ్రేకింగ్ రంగాలలో కూడా పని చేశాడు, అలాగే బ్రిటిష్ సైన్స్‌లో సంస్కరణ కోసం ప్రచారం చేశాడు. అతను 18 అక్టోబర్ 1871న లండన్‌లోని తన ఇంటిలో మరణించాడు.

బాలచెలిమి డెస్క్

# కోతి రాయబారం



రామాపురం గ్రామంలో రచ్చబండ దగ్గర గ్రామ ప్రజలు సమావేశమయ్యారు. సర్పంచ్ అధ్యక్షతన సభ నిర్వహిస్తున్నారు. గ్రామంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, పెంకుటిళ్ళ పెంకలు పగుల కొడుతున్నాయని, ఇంట్లోకి చొరబడి తిండి పదార్థాలు ఎత్తుకెళ్తున్నాయని, విద్యుత్ తీగలపై వేలాడి త్రెంచు తున్నాయని, ఆరుబయట ఎండలో పోసిన ధాన్యాన్ని నష్టపరుస్తున్నాయని గ్రామ ప్రజలు కోతుల వలన తమకు జరిగిన నష్టాలను సర్పంచ్‌కు చెబుతున్నారు.

గ్రామ ప్రజలకు కోతుల వలన వేలాది రూపాయల నష్టం జరిగిందని భావించిన గ్రామ పంచాయితీ కోతుల బెడదకు శాశ్వత పరిష్కారం కొరకు రెండు కొండ ముచ్చులను తెచ్చి గ్రామంలో తిప్పాలని, అప్పుడు కోతులు పారిపోతాయని గ్రామ సభ ఏకగ్రీవంగా తీర్మానించింది. అందుకు కావలసిన ఖర్చులను గ్రామ పంచాయితీ భరిస్తుందని సర్పంచ్ చెప్పగానే ప్రజలందరు తమ కష్టాలు తీరగలవని సంతోషించారు.

గ్రామసభను దూరంగా చెట్టుపై నుండి చూస్తున్న పిల్లకోతి కంగారుగా, పరుగెత్తుకుంటూ తన తల్లి దగ్గరికి వెళ్లి విషయం చెప్పింది. తల్లి కోతి భయపడి మిగతా కోతులకు చెప్పింది. దిక్కుతోచని కోతులన్ని ఒక చెట్టుపై సమావేశం నిర్వహించాయి. రామాపురం గ్రామంలో చెట్లపై, ఇండ్లపై, గోడలపై గెంతులేసే కోతులన్ని ఆ సమావేశానికి హాజరు అయ్యాయి. కొండముచ్చులు వస్తే మన పరిస్థితి ఏమిటని భయపడిపోయాయి. "మనం రామాపురం విడిచి

వెళ్ళవలసిందేనా" అని కొన్ని కోతులు దీనంగా మాట్లాడాయి. "నిరాశ్రయులమై పొరుగూరి కెళితే అక్కడి కోతులు మనలను రానిస్తాయా" రకరకాల సందేహాలతో కోతులు భయపడుతున్నాయి. ఇంతలో ముసలి కోతి లేచి నిలబడి "నా ప్రియమైన కోతులారా! మీరేమి భయపడకండి. ఈ సమస్య వస్తుందని నాకు ముందే తెలుసు. ప్రజలు వారి సమస్యలకు పరిష్కారంగా మనకు సమస్యను సృష్టించబోతున్నారు. ఇందులో వారి తప్పేమిలేదు. మనలోని కొన్ని అల్లరి కోతులు సరదాగా పెంకులు పగులకొట్టి వారి ఇళ్ళను నాశనం చేసారు. ఎన్నో విధాలుగా ఎంతో మందిని నష్టపరచారు. తప్పు మనది కూడా ఉన్నది. మనం తినేది తక్కువ. పడేసేది ఎక్కువ. వారికి నిద్రలేకుండా చేసాము అందుకే వారు కఠిన నిర్ణయం తీసుకున్నారు". అంది.

''మనం కొండముచ్చుల దాడికి బలి కావలసిందేనా?'' కోతులన్ని ముక్త కంఠంతో ప్రశ్నించాయి.

"మీ రేమి చింతించకండి రేపు సర్పంచ్ దగ్గరికి వెళ్లి మాట్లాడతాను. నా మీద నమ్మకముంచి ప్రశాంతంగా ఉండండి" ముసలి కోతి అభయ మిచ్చింది.

మరునాడు ముసలికోతి నేరుగా సర్పంచ్ ఇంటికి వెళ్ళింది. సర్పంచ్ ముందుగా ఆశ్చర్యపోయినా తర్వాత కోతిని ఆహ్వానించాడు. తాను కోతుల తరపున రాయబారిగా వచ్చానని తాను చెప్పిన విషయం పూర్తిగా వినాలని ముసలి కోతి ప్రాధేయపడింది. సర్పంచ్ అంగీకారం తెలిపాడు.

"సర్పంచ్ గారు, కోతుల సమస్య కొరకు పరిష్కారంగా కొండముచ్చులను తీసుకురావడం సమర్థనీయం కాదు".

సర్పంచ్ ఆసక్తిగా వింటున్నాడు కోతి మొదలెట్టింది.

"మీరు మేము ఒక జాతి సంతతి వారమే. మేము మీ ఊరికి రావడానికి కారణం మీ ఊరి ప్రక్కనున్న అడవిలోని చెట్లన్ని నరికేసారు. పరిశ్రమలు నిర్మించారు. మాకున్న జీవనాధారమైన అడవిలోని పండ్ల చెట్లను నరికి, పర్యావరణాన్ని కలుషితం చేసారు. ఇపుడు వర్షాలు సరైన సమయంలో కురవడం లేదు. అడవులను మీ స్వార్థానికి నాశనం చేసారు. నేరం మా మీదకి నెట్టుతున్నారు. బ్రతుకు దెరువు కోసం, మా పిల్లల పోషణ కొరకు మీ ఊరికి రావలసి వచ్చింది. మా వాళ్లు మీ గ్రామానికి నష్టం కల్గించిన మాట నిజమే.

మా అడవి మాకు ఇవ్వండి. మేమే వెళ్తాము. పర్యావరణ సమస్యను పరిష్కారించాల్సింది పోయి. కోతుల సమస్య కోసం గ్రామ సభలు నిర్వహిస్తారా? మా కొరకు కాదు. మీ సంక్షేమం కొరకే చెబుతున్నాను. మొక్కలు నాటండి చెట్లను పెంచండి. అడవులను పెంచండి, పర్యావరణాన్ని రక్షించండి, రేపటి తరానికి బంగారు బాటలు వేయండి. ఒకసారి ఆలోచించండి. మా వాళ్లను హెచ్చరిస్తాను. మా వల్ల మీకెలాంటి నష్టముండదని మాట ఇస్తున్నాను. ముసలి కోతి వెళ్ళింది. సర్పంచ్‌కు జ్ఞానోదయం కలిగింది. అడవులను పెంచాలనే ప్రణాళికతో గ్రామ పంచాయితీ కార్యాలయానికి బయలుదేరాడు.

– భైతి దుర్గయ్య
రామునిపట్ల, సిద్ధిపేట.
m : 9959007914

# అనితా పాల్‌దురై

అనితా పాల్‌దురై తమిళనాడులోని చెన్నైకి చెందిన అసాధారణమైన భారతీయ బాస్కెట్ బాల్ క్రీడాకారిణి. అనిత మధ్య తరగతి కుటుంబానికి చెందిన వవారు. బాస్కెట్‌బాల్ క్రీడ యందు మక్కువ కలిగి ఉండడం తాను తన 4వ ఏట తెలుసుకున్నారు. తన 15వ ఏట భారత జాతీయ మహిళా బాస్కెట్‌బాల్ జట్టులో చేరారు. అనితకు ఆకట్టుకునే సామర్థ్యం, తొమ్మిది వరుస ఆసియా బాస్కెట్ బాల్ కాన్ఫెడరేషన్ ఛాంపియన్‌షిప్‌లలో పోటీ పడింది. జాతీయ ఛాంపియన్ షిప్‌లలో 30 పతకాలను గెలుచుకుంది. 2006 కామన్వెల్త్ గేమ్స్, 2010 ఆసియా క్రీడలు వంటి ప్రధాన అంతర్జాతీయ ఈవెంట్‌లలో ఆడింది. అక్కడ ఆమె తన అసాధారణ ప్రతిభను ప్రదర్శించింది.



ఆర్టిస్ట్: బాబు దుండ్రపల్లి

అనిత సాధించిన విజయాలు ఆమెకు అనేక అవార్డులను తెచ్చిపెట్టాయి. ముఖ్యంగా, అనిత 2021లో పద్మశ్రీ అవార్డును అందుకుంది. తమిళనాడు మహిళా అచీవర్ అవార్డు, ముఖ్యమంత్రి రాష్ట్ర క్రీడా పురస్కారం వంటి పలు అవార్డులు ఆమెకు లభించాయి.

అనిత సాధించిన విజయాలు బాస్కెట్ బాల్ కోర్టుకే పరిమితం కాలేదు. ఆమె మద్రాసు కళాశాల నుండి కామర్స్‌లో బ్యాచిలర్ డిగ్రీని, అన్నామలై కళాశాల నుండి మానవ వనరుల నిర్వహణలో ఎంబిఎ పట్టా పొందారు, ఆమె 2003లో సదరన్ రైల్వేలో చేరారు. టికెటింగ్ విభాగంలో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీగా పని చేస్తున్నారు.

బాస్కెట్‌బాల్ అనితా పాల్‌దురై ప్రయాణ కృషి, అంకిత భావం మరియు కనికరం లేని అభిరుచికి సంబంధించిన కథ. అనిత 19 సంవత్సరాల అతి పిన్న వయస్సులో సీనియర్ జాతీయ జట్టుకు కెప్టెన్‌గా ఎనిమిదేళ్ళు నాయకత్వం వహించారు.

**– 'షీరోస్-256 ఇన్‌స్పైరింగ్ వుమెన్ ఫ్రమ్ ఇండియా' నుండి....**


అక్షరం

# కష్టమైన అక్షరాలు ఇష్టంగా!


ఏ భాషలోనైనా సహజంగా కొన్ని అక్షరాలు క్లిష్టంగా రాయడానికి ఇబ్బందిగా ఉంటాయి. ఉదాహరణకు తెలుగులో అచ్చుల్లో ఐ, హల్లుల్లో 'ణ' వంటివి. అటువంటి అక్షరాలను ఒక పద్ధతిలో, సూక్ష్మంతో ఎలా సునాయాసంగా రాసేయవచ్చో చూద్దాం. ముందుగా 'ల' ఒత్తును రెండు మూడు సార్లు అభ్యాసం చేసి, తరువాత అదే 'ల' ఒత్తును క్రింది నించి పైకి నిలుచున్న ఆకారంలో; కుడివైపు నుంచి ఎడమ వైపుకు రాయాలి.



'ణ' సులభంగా రాయడానికి... మొదటిగా నిలువు ఆకారంలోని 'ల' ఒత్తును రాసి, దానికి 'ల' ఒత్తును యదాతథంగా కలిపి, చివరిగా కుడివైపు నుంచి ఒక సున్న ఆకారంలో ముగించాలి.



అదే విధంగా 'ఐ' అనే అక్షరం రాయడానికి అచ్చుల్లోని 'ఎ' రాసి, చేతికి పైకెత్తకుండా కుడివైపు నుంచి ఎడమ వైపుకు 'ల' ఒత్తును రాయాలి. ముఖ్యమైన విషయమేమిటంటే ప్రారంభించినప్పుడు రాసిన సున్నకు సమానమైన ఎత్తులో 'ల' ఒత్తు ముగిసేలా చూసుకోవాలి. ఎక్కువ మంది 'ల' ఒత్తు భాగం మరీ ఎడమ వైపుకో, బాగా కుడివైపుకో రాసి 'ఐ' ఆకారాన్ని కోల్పోయేలా రాస్తారు గమనించండి.




అలాగే 'త' తప్పులను తొలగించి సరైన పద్ధతిలో అభ్యసించండి. అక్షరం మీద పట్టు సాధించిన తరువాత 'త' గుణింతంలో సరైన 'త' ఆకారాన్ని ఉపయోగిస్తూ అభ్యసించాలి.




'ఇ' అనే అక్షరం రాసినప్పుడు 'ల' ఒత్తు భాగంతో ప్రారంభిస్తాం కదా, క్రింది వైపున ఉండే 'న' ఒత్తు భాగం సరిగ్గా ప్రారంభ గీతకు క్రింద సమాంతరంగా ఉండాలి. కాస్త ఎడమ వైపుకో కుడివైపుకో రాస్తే అక్షరం ఆకారం పాడవుతుంది.




'ఖ' రాసినప్పుడు ఒకే గీతలో రాయకూడదు. సరదాగా లేదా వెరైటీ కోసం తయారు చేసిన కొన్ని ఫాంట్‌లలో మాత్రమే అలా ఉంటుంది. అక్షరం పై భాగం రాసిన తరువాత చేతిని పైకెత్తి నిలువుగీత విడిగా రాయాలి.



చాలా మందిని 'అ' కష్టతరంగా ఉంటుంది. అక్షర మాలలోని మొదటి అక్షరం 'అ' మొదటి ఎడమ వైపు అర్ధ భాగం రాసి, 'ట' వంటి అక్షరాలకు రాసే క్రింది నొక్కు భాగ్ రాసి... 'అ' అక్షరం కుడి అర్ధ భాగాన్ని యదాతథంగా రాయడం ద్వారా ఎంతో సులభంగా 'అ' రాసేయవచ్చు.



'శ' మరియు 'ళ' రాసినప్పుడు మెలిక భాగంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలి.



– వై. మల్లికార్జున రావు,

డైరెక్టర్, మహా అకాడెమి, m : 9966961642

కథ



# బంగారు చేప

అనగనగా ఒక ఊరు ఉండేది. ఆ ఊరిలో రుద్రయ్య అనే చేపల వ్యాపారి ఉండేవాడు. అతనికి రాజు అనే కొడుకు ఉండేవాడు. రాజు చాలా సోమరిపోతు. రుద్రయ్య ముసలివాడు అయిపోయాడు. తన వృత్తిని తన కొడుకుకి అప్పగించాలి అనుకున్నాడు. కొడుకుని పిలిపించి, 'నువ్వు రేపటినుండి చేపలు పట్టడానికి వెళ్ళాలి' అన్నాడు. రాజు మాత్రం, 'నేను వెళ్ళను. ఏం పని చెయ్యకుండానే, డబ్బు వచ్చే పని చేస్తాను' అన్నాడు. దానికి రుద్రయ్య చాలా బాధపడ్డాడు. ఎలాగైనా కొడుకు జీవితం బాగు చేయాలనుకున్నాడు. ఆ ఊర్లోకి ఒక ఋషి వచ్చాడని తెలిసిన రుద్రయ్య ఆయనను కలిశాడు. ఆ ఋషి రుద్రయ్యకు ఒక ఉపాయం చెప్పాడు. రుద్రయ్య కొడుకును పిలిపించి, నువ్వు కొన్ని రోజులు చేపలు పడితే నీకు బంగారు చేపలు దొరుకుతాయని చెప్పాడు. రాజు సంతోషంగా చేపలు పట్టూ జీవించాడు. కొన్ని రోజుల తర్వాత బంగారు చేప దొరకక పోవడంతో విసుగు చెందిన రాజు, 'రేపటి నుండి చేపలు పట్టడానికి వెళ్లను' అని చెప్పాడు. రుద్రయ్య నవ్వుతూ పెట్టెను తెరిచి, బంగారు చేపను తీసి రాజు చేతిలో పెట్టాడు. బంగారు చేపను చూసి రాజు చాలా ఆశ్చర్యపోయాడు. రుద్రయ్య 'ఇవి నువ్వు చేపలు పట్టి సంపాదించిన డబ్బులతో చేసినవి' అని అన్నాడు. అప్పటి నుండి రాజు రోజూ చేపలు పట్టడానికి వెళ్లి, తన కుటుంబాన్ని పోషించాడు.

– ఎస్. శివాని
7వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తడపాకల్,
ఏర్గట్ల, నిజామాబాద్

కథ

# తికమక



అనగనగా ఒక రాజ్యంలో రాజుగారు ఉండేవారు. ఆ రాజుగారి కోటలో ఓ అందమైన కొలను ఉండేది. ఆ కొలను కలువలూ, అందమైన బాతులతో చూడచక్కగ ఉండేది. రాజుగారు సమయం దొరికినప్పుడల్లా ఆ కొలను దగ్గర కూర్చొని సేద తీరేవాడు. ఓ రోజు కొలను దగ్గర ఉండగా, రాజుగారికి ఆకస్మాత్తుగా ఓ ఆలోచన వచ్చింది. కొన్ని చేపలను కొలనులో పెంచితే బాగుంటుంది కదా అనుకుని, వెంటనే భటులను పిలిపించి అందమైన చేపలను తెమ్మని ఆజ్ఞాపించెను.

రాజుగారి ఆజ్ఞ ప్రకారం, అందమైన చేపలను తెచ్చి రాణిగారికి ఇచ్చారు. “అసలు విషయం” తెలియని రాణిగారు ఆ చేపలతో చక్కగా చేపల పులుసు వండించి రాజుగారికి వడ్డించేసింది. రాజుగారు చేపలకూర తిన్న తరువాత భటులను చేపలు తెమ్మన్నానని గుర్తుకువచ్చి వెంటనే భటులను అడిగితే “మేం ఎప్పుడో వాటిని రాణిగారిని అందించామని” సమాధానం ఇస్తారు వాళ్లు. తీరా ‘చేపలు ఏవి’? అని రాణిని అడిగితే, “కూర కోసం చేపలు తెప్పించారని వండించేశా”నని అసలు విషయం చల్లగా చెప్పిందావిడ.

జరిగిందానికి రాజుగారికి మొదట కోపం వచ్చినా “ఏది ఏమైనప్పటికినీ ఒక విషయం – తెలియజేయాలి అనుకున్నప్పుడు దాన్ని వివరంగా ఎందుకు? ఏమిటి? అని చెప్పాల”ని తెలిసివచ్చింది.

**నీతి:** ఎటువంటి విద్యార్థి అయినా అసలు విషయం తెలుసుకోవాలంటే ఎందుకు? ఏమిటి? ఎలా? అనే ప్రశ్నలను వేసుకొని ఆ విషయాన్ని గ్రహించుకోవచ్చు”.


– ఎం.ఎన్. జయంత్ కుమార్



9వ తరగతి

ఎం.జి.ఎస్. పాఠశాల

మహబూబ్‌నగర్

కథ

# పంది - తోడేలు

ఒక పంది తన కొట్టంలో నిద్రపోతోంది. ఒక తోడేలు అటువైపు వెళ్తూ పంది కొట్టాన్ని చూసింది. అది పందితో – "నాకు చాలా నీరసంగా ఉంది. కళ్ళు తిరుగుతున్నాయి. దయచేసి ఈ రాత్రికి నీ కొట్టంలో తలదాచుకోనిస్తావా? నాకు కాస్త స్థలం అయితే చాలు సర్దుకుంటాను" అంది దీనంగా. తోడేలు చెడ్డది అని తెలిసి కూడా పంది జాలిపడి, "అదెంత అభాగ్యం. వచ్చి పడుకో!" అంది.

తోడేలు ఆ రాత్రి పంది కొట్టంలో పడుకుంది. ఆ రాత్రే తోడేలు పిల్లల్ని కనింది. తెల్లవారి లేవగానే పంది "నా కొట్టం ఖాళీ చెయ్యి, నేను నీకు ఇచ్చిన మాట ప్రకారం ఒక రోజు ఆశ్రయం ఇచ్చాను" అంది.

"పంది బావా! చూశావుగా నా పరిస్థితి. నా పిల్లలు చాలా చిన్నవి. కొన్ని రోజులు ఆగితే అవి పెద్దవి అవుతాయి. అప్పుడు నువ్వు చెప్పకుండా, నేనే వెళ్ళిపోతాను" అంది.

పంది 'సరేలే' అని ఇంకా కొన్ని రోజులు ఆగింది. అలా... అలా... చాలా రోజులు గడిచిపోయాయి.

"తోడేలు బావా! నువ్వు వచ్చి చాలా రోజులయింది. నీ పిల్లలు కూడా పెరిగి పెద్దవయ్యాయి. కాబట్టి నువ్వు నా కొట్టం ఖాళీ చేసి వెళ్ళు" అంది.

అది విని తోడేలు కోపంగా – "నీకెన్ని గుండెలు? నన్నే వెళ్ళమంటావా. మేమిప్పుడు ఆరుగురు ఉన్నాం. మేం తలుచుకుంటే నిన్ను ముక్కలు ముక్కలు చెయ్యగలం" అంది.

పందికి ఏం చేయ్యాలో తోచలేదు. "దుష్టులను దూరంగా ఉంచక, దగ్గరకు రానియ్యడం మేలు చెయ్యడం తను చేసిన పెద్ద తప్పు" అని విచారిస్తూ పంది, కొట్టం విడిచి తనే దూరంగా వెళ్ళిపోయింది.

లియో టాల్ స్టాయ్

మార్చ్ 1991, బాలచెలిమి కథల సంచిక నుండి



కథ

# గురువు చెప్పిన గుణపాఠం




పూర్వం సత్యానందుడి గురుకులంలో చాలా మంది విద్యార్థులు విద్యాబుద్ధులు నేర్చుకునే వారు. ఆయన ఎంతో మందిని పండితులుగా తీర్చి దిద్దాడు. కాని విజయవర్మ అజేయ వర్మ అనే రాకుమారుల విషయం లో మాత్రం ఓ ఇబ్బంది ఎదురైంది.

వారిద్దరూ ఏదైనా విద్యను నేర్చుకోవడం ప్రారంభించిన ఒకటి, రెండు రోజుల్లోనే... 'గురువు గారూ మాకు ఈ విద్య అబ్బడం లేదు. మరోటి నేర్పండి' అనేవారు.

సత్యానందుడు వారిలో ఎలా అయినా మార్పు తేవాలనుకున్నాడు. ఒకరోజు ఇద్దరినీ పిలిచి ఆశ్రమంలో మొక్కలు నాటడానికి గుంతలు తవ్వే పని అప్పగించాడు. వాళ్లు కాస్త తవ్వగానే... 'ఇక్కడ మట్టి బాగాలేదు. అదిగో అక్కడ తవ్వండి' అని మరోచోట చూపించాడు.

వారు గురువుగారు చెప్పిన చోట తవ్వడం ప్రారంభించగానే తిరిగి మరో చోట తవ్వమని ఆయన చెప్పాడు. ఇలా సత్యానందుడు ఓ నాలుగైదు సార్లు చేసే సరికి, 'ఇలాగైతే గుంతలు తవ్వడం ఎలా పూర్తి అవుతుంది, మొక్కలు నాటడం ఎప్పుడు పూర్తవుతుంది' అని శిష్యులు గురువు గారిని భయం భయంగానే అడిగారు.

సత్యానందుడు నవ్వుతూ... 'ఎందుకు పూర్తి కాదు. భేషుగ్గా పూర్తవుతుంది. మీరు ఆ విద్య కొంత, ఈ విద్య కొంత నేర్చుకుంటూ... మీ విద్యాభ్యాసం ఎలా పూర్తి చేస్తారో... ఈ పని కూడా అలానే పూర్తవుతుంది' అని సత్యానందుడు ప్రశ్నించాడు. 'మన్నించండి గురువర్యా! ఇక పై మీరు చెప్పినట్లే నడుచుకుని, మా విద్యాభ్యాసం పూర్తి చేస్తాం' అని విజయవర్మ, అజేయవర్మ మాటిచ్చాడు.


అప్పటి నుంచి వారు మధ్యలోనే దేన్నీ వదిలి వేయకుండా సంపూర్ణంగా విద్యలు నేర్చుకున్నారు. సత్యానందుడికి ప్రియశిష్యులుగా మారారు.

– అనగ

9వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్

ఆట

# గుంపులో బంతి



ఒక వృత్తంలో కొందరు పిల్లలుంటారు. వృత్తం బయట కొంచెం దూరంలో ఒక పిల్ల నిలబడి బంతితో వృత్తం లోపలి వారిని కొడుతుంది. బంతి ఎవరికి తగిలితే వారు అవుట్. ఈ అమ్మాయి వృత్తంలోని పిల్లల్లో చేరుతుంది. అవుటయిన వాడు బంతి తీసుకొని ఆట మళ్ళీ మొదలెడతాడు.

ఇలా ఆడుతున్నప్పుడు చిట్టచివరిదాకా బంతి తనకు తగలకుండా తప్పించుకొని అవుట్ కాకుండా ఉన్న అమ్మాయి గెలిచినట్టు. తప్పించుకొనేపుడు వృత్తం బయటికి వచ్చిన వారు కూడా అవుటయినట్టే లెక్క.

ఈ ఆటను ఇంకోవిధంగా కూడా ఆడొచ్చు. పిల్లలు రెండు జట్లుగా మారుతారు. ఒక జట్టు వృత్తంలో ఉంటుంది. మరో జట్టు వృత్తం బయట ఉంటుంది. బయటి వారికి ఒక్కొక్కరికి ఒక్కో ఛాన్సు ఇచ్చి వృత్తంలోని వారిని కొట్టమనాలి. అందరూ అవుటయ్యాక వృత్తంలోని వారు బయటికి వచ్చి ఆట మొదలెడతారు.

- వృత్తం పెద్దదిగా ఉండి పిల్లలు బంతిని తప్పించుకోడానికి అనుకూలంగా ఉండాలి.
- వృత్తానికి, బయటి నుంచి బంతి వేసే వారికి మధ్య దూరం పిల్లల వయస్సును బట్టి మార్చాలి.


– 'ఆటలంటే మాకిష్టం' నుండి...

## సామెతలు

- అత్త మీద కోపం దుత్త మీద చూపినట్లు...
- సన్నాయి నొక్కులే గాని... సంగీతం లేదన్నట్లు
- అత్త సొమ్ము అల్లుడు దానం చేసినట్లు...
- అందితే జుట్టు అందకపోతే కాళ్లు
- వసుదేవుడంతటి వాడు గాడిద కాళ్లు పట్టుకున్నట్టు
- ముందొచ్చిన చెవులకన్నా వెనకొచ్చిన కొమ్ములు వాడి
- మింగ మెతుకు లేదు – మీసాలకు సంపెంగ నూనె

కథ

# సుల్తాన్ మురాట్




అనగనగా ఒక ఊరిలో 'సుల్తాన్ మురాట్' అనే పిల్లవాడు ఉండేవాడు. అతను చాలా అల్లరి పిల్లవాడు. కాని రోజూ బుద్ధిగా బడికి వెళ్ళేవాడు. కొన్నాళ్ళకి వేసవి సెలవులు మొదలయ్యాయి.

ఓ రోజు సుల్తాన్ మురాట్ వాళ్ళ నాన్న "బాబూ! త్వరలో నేను పనుండి పట్టణానికి వెళ్తున్నాను, నీకు ఇష్టమైతే నిన్ను కూడా తీసుకువెళతాను" అన్నాడు.

"నాకు ఇష్టమే నాన్న" అన్నాడు పిల్లవాడు.

ఈ వార్త విని ఆనందంతో గంతులు వేశాడు పిల్లవాడు.

ఎందుకంటే తను పుట్టిపెరిగిన తరువాత ఇంతవరకు పట్టణం చూడలేదు మరి. తన బడిలో కొంత

మంది పిల్లలు అప్పటికే పట్టణాన్ని చూసి వున్నారు. వాళ్ళు ఆ విశేషాల్ని కథలు కథలుగా చెప్పేవాళ్ళు.

అప్పటి నుండి పిల్లవాడు అల్లరి చేయటం తగ్గించాడు. మొక్కలకు నీళ్ళుపోయడం, వాళ్ళ పెంపుడు గాడిదకు దాణా తినిపించటం, అమ్మకు సాయం చేయడం, చేసేవాడు. ఇది చూసి అందరూ ఆశ్చర్య పోయేవారు.

"పిల్లవాడు ఇంత బుద్ధిమంతుడిలా ఎలా మారి పోయాడు?" అని.

వాళ్ళ ఇంట్లో ఉన్న పెంపుడు గాడిద పేరు 'బ్లాక్లీ'. అది చిన్నగా ఉన్నప్పుడు, దాన్ని సుల్తాన్ మురాట్ మేనమామ బహుమతిగా ఇచ్చాడు. బ్లాకీ బట్టలమూట మోయగలదు. కట్టెలమోపు మోయగలదు. ఇలా ఇంటిపనికి ఎంతో సహాయకారిగా వుండేది.

ఓ రోజు పిల్లవాడి నాన్న, బ్లాకీకి కళ్ళెం వెయ్యాలన్నాడు. పిల్లవాడు గాడిద మీద కూర్చుని దానికి కళ్ళెం వేయబోయాడు.

అది ఒడుపుగా పిల్లవాడిని కింద పడేసింది.

మళ్ళీ పిల్లవాడు కళ్ళెం వేయబోయాడు.

బ్లాకీ తెలివిగా తప్పించుకొంది.

పిల్లవాడు బ్లాకీకి కళ్ళెం వేయడానికి సర్కస్ ఫీట్లు చెయ్యాల్సి వచ్చింది.

చివరికి నాన్న సాయం చేశాడు. బ్లాకీకున్న పెద్ద చెవుల్ని మెలితిప్పాడు నాన్న. అప్పుడది బుద్ధిగా సహకరించింది. మొత్తానికి పిల్లవాడు విజయ వంతంగా బ్లాకీకి కళ్ళెం వేయగలిగాడు.

పిల్లవాడు పట్టణం వెళ్ళేరోజు కోసం ఎదురు చూస్తున్నాడు. రోజులు లెక్కపెట్టుకుంటూ గడిపాడు. రేపు ఉదయం పట్టణానికి ప్రయాణం అనగా, ముందు రోజు రాత్రి పిల్లవాడికి నిద్రపట్టలేదు. ఆరుబయట నులక మంచంపై పడుకుని, ఆకాశంలో చందమామని చూస్తూ, చుక్కల్ని లెక్కపెట్టుకుంటూ గడిపాడు. చివరికి ఏ అర్ధరాత్రో నిద్రపట్టింది.

పొద్దుటే సుల్తాన్ మురాట్‌ను వాళ్ళ అమ్మ నిద్ర లేపింది.

"త్వరగా తయారవు బాబూ! పట్నం వెళ్ళే వేళయింది" అని తొందర చేసింది.

క్షణాల్లో తయారయ్యాడు పిల్లవాడు. చిరుతిళ్ళు ఓ సంచిలో పెట్టి మురాట్‌కు ఇచ్చింది వాళ్ళమ్మ. వాటిని తీసుకుని గుర్రంపై ఎక్కి, అమ్మకి 'టాటా' చెప్పి, నాన్నతోపాటు పట్టణానికి బయలుదేరాడు.

మొదటగా వాళ్ళ ఇల్లు, పొలం, ఊరు, ఆ తర్వాత స్టెపీ మైదానాలు దాటారు. దారిలో ఓ చోట ఆగి చిరుతిళ్ళు తిని, టీ తాగారు.

గుర్రాన్ని తోలే అవకాశం పిల్లవాడికొచ్చింది. గుర్రం తన కొత్త యజమానిని చూసి సకిలించింది. పిల్లవాడు ఒడుపుగా కళ్ళాన్ని పట్టుకుని గుర్రాన్ని అదిలించాడు.

అది మెల్లిగా నడక ప్రారంభించింది.

కొద్దిసేపటి తర్వాత నాన్న గుర్రాన్ని తోలటం ప్రారంభించాడు. దౌడు తీయించాడు.

అలా చాలా దూరం ప్రయాణించాక, పట్టణ శివార్లు మొదలయ్యాయి.

ఎత్తయిన భవంతులు, పెద్ద పెద్ద ఫ్యాక్టరీలు చూసి పిల్లవాడు ఆశ్చర్యపోయాడు. పట్టణంలో వాళ్ళు అందమైన బట్టలు ధరించి అటూ ఇటూ హడావుడిగా తిరుగుతున్నారు. పట్టణమంతా రణగొణధ్వనులతో నిండి వుంది.

ఆ రోజు పట్టణంలో జంతువుల సంత, అలాగే సర్కస్ జరుగుతున్నాయి. పిల్లవాడు తన అదృష్టాన్ని తానే నమ్మలేక పోయాడు. జీవితంలో మొదటిసారి పట్టణాన్ని చూడటానికి వచ్చాడు. ఆ రోజు జంతువుల సంత, సర్కస్ జరగడం తన అదృష్టంగా భావించాడు.

మొదట టిక్కెట్టు కొనుక్కొని, అద్దాల హాలులోకి

వెళ్ళాడు. ఎటుచూసినా అద్దాలే. తన ముక్కు పొడుగ్గా సాగినట్లు, తన కాళ్ళు ఎన్నో కాళ్ళుగా మారినట్టు, తన ముఖం ఎన్నో ముఖాలుగా కనిపించటం చూసి పిల్లవాడు ఆశ్చర్యపోయాడు, నవ్వుకున్నాడు, ఎంతో ఆనందించాడు.

సంతలోని జనాన్ని తప్పించుకుంటూ, వాళ్ళు జంతువులను చూడడం మొదలుపెట్టారు. ఏనుగులు, ఒంటెలు, ఎలుగుబంట్లు, కోతులు, రకరకాల పక్షులు ఇలా ఎన్నో ఉన్నాయక్కడ. ఏనుగు చుట్టూ చేరి పిల్లలు కేరింతలు కొడుతున్నారు. ఏనుగు తెలివితేటల గురించి, మంచితనం గురించి కథలు కథలుగా చెప్పుకుంటున్నారు.

"ఓసారి ఏనుగు తన పెద్ద తొండంతో అమాంతం ఓ పిల్లవాడిని పైకి లేపి, పాము నుండి కాపాడిందట." ఇలా ఉన్నాయి ఆ కథలు. అవి విని మన పిల్లవాడు, వాళ్ళ నాన్న సంతోషించారు.

అప్పటికి పొద్దుగూకింది. నాన్న ఇంటికి కావలసిన సరుకులు, నూనె కొన్నాడు. నూనె డబ్బాలను గుర్రానికి అటు ఇటూ తగిలించాడు. సర్కస్‌లో చిరుతిళ్ళు కానిచ్చారు. ఇంటికి బయలు దేరారు. అలసిపోయిన పిల్లవాడు గుర్రంపై ప్రయాణిస్తూనే నిద్రలోకి జారాడు.

గుర్రం ఎత్తయిన ప్రదేశాల్ని దాటుతున్నపుడు ఉలిక్కిపడి నిద్రలేచేవాడు. వాళ్ళ నాన్నని గట్టిగా కౌగలించుకుని మరలా నిద్రపోయేవాడు. ఇంత మంచి నాన్నకు కొడుకుగా పుట్టినందుకు ఎంతో ఆనందపడ్డాడు పిల్లవాడు. చివరికి వాళ్ళు క్షేమంగా ఇల్లు చేరారు.

పిల్లలూ! మరి మీరు గ్రామాల్లో నివసిస్తూ ఉంటే మొదటిసారి పట్టణాన్ని ఎప్పుడు చూశారు?

జంతు ప్రదర్శనశాలల్ని, సర్కస్‌ని మొదటిసారి చూసినప్పుడు మీకేమనిపించిందో నాకు చెప్పండి!

**– చింగీజ్ ఐత్‌మాతోవ్**

English Title : Sultan Murat goes to town
Writer : Chinghiz Aitmatov
English Translation : James Riordan

**చింగీజ్ ఐత్‌మాతొవ్ (1928–2008):**

కిర్గిజ్ రచయిత, కిర్గిజిస్థాన్ మహాకవిగా ప్రసిద్ధం. ఇతను రచించిన 'జమీల్యా' నవల ప్రపంచ ప్రసిద్ధ ప్రేమగాథ. 'తల్లీ భూదేవి', 'తొలి ఉపాధ్యాయుడు' వంటి నవలలు కూడా ఎంతో పేరు తెచ్చుకున్నాయి.


చందదారులుగా చేరండి! బాల చెలిమి చందదారులను చేర్పించండి!

'ఎం.వేదకుమార్ సంపాదకత్వంలో వెలువడుతున్న 'బాల చెలిమి' పిల్లల మాసపత్రిక బాలబాలికలకు చేరడంలో తల్లిదండ్రుల, ఉపాధ్యాయ, పాఠశాల నిర్వహకుల, మేధావుల అమూల్య సహకారాన్ని కోరుతున్నాం. చందదారులుగా చేరడంతోపాటు తమకు తెలిసినవారిని చందదారులుగా చేర్పించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం.

**మా చిరునామా :**
BALA CHELIMI
"CHANDRAM" 3-6-712/2,
St.No. 12, Himayatnagar
Hyderabad - 500 029.
Mob: 9030626288
E-mail:desk.chelimi@gmail.com,
www.balchelimi.com

**చందా వివరాలు :**
విడి ప్రతి : రూ. 40
వార్షిక చందా : రూ. 400
2 సం॥లకు : రూ. 750
*'బాల చెలిమి' పేరిట నగదు, చెక్ లేదా ఆన్‌లైన్ రూపంలో చందామొత్తం చెల్లించవచ్చు.*

**ACCOUNT DETAILS :**
Bank Name : Canara Bank
A/C No. : 30101010003714
Branch : Ashoknagar, HYDERABAD.
IFSC Code : CNRB0013010



యాత్ర

# అమరావతి

ఉమ్మడి గుంటూరు జిల్లా. ప్రస్తుత పల్నాడు జిల్లాలో కృష్ణానది తీరగ్రామం అమరావతి. గుంటూరుకు 32 కి.మీ. దూరంలో ఉంది. ఉత్తర వాహినిగా ప్రవహించడం ఇక్కడ కృష్ణానది ప్రత్యేకత. ధరణికోట, అమరావతి జంట గ్రామాలు. ధరణికోటకు మరో పేరు ధాన్య కటకం. ఇది శాతవాహనుల రాజధానిగా విలసిల్లింది. 1680-1700 కాలంలో వాసిరెడ్డి వెంకటాద్రి నాయుడు ఈ ప్రాంతాన్ని పాలించారు. అమరావతి దీని చుట్టుపట్ల గ్రామాలు పాడి పంటలతో కళకళలాడుతుంటాయి.

అమరావతి మహాచైత్యం దక్షిణ భారతదేశంలోని బౌద్ధ తీర్థయాత్రల ప్రముఖ ప్రదేశాలలో ఒకటి; ఇక్కడి స్మారక చిహ్నం చాలా ముఖ్యమైనది.

స్థానికంగా, మహాచైత్యాన్ని దీపాలదిన్నె (దీవెనల కొండ అని అర్థం) అని పిలుస్తారు. అమరావతిలోని ధ్యాన బుద్ధ విగ్రహం 125 అడుగుల ఎత్తులో ఉంటుంది. బుద్ధుడు ధ్యాన స్థితిలో చిత్రీకరించబడ్డాడు. విగ్రహం ఎనిమిది స్తంభాలను కలిగి ఉంది, విగ్రహం కింద ఒక మ్యూజియం ఉంది, ఇందులో అనేక బౌద్ధ శిల్పాలు ఉన్నాయి.


అమరావతిలోని పురావస్తు మ్యూజియంలో ప్రధానంగా మహాచైత్యం వద్ద జరిగిన వివిధ త్రవ్వకాలలో వెలికితీసిన అవశేషాలు ఉన్నాయి. ఈ మ్యూజియంలో మూడు గ్యాలరీలు ఉన్నాయి. స్థూపం యొక్క నమూనాను ప్రాంగణంలో చూడవచ్చు. ఆంధ్ర ప్రదేశ్‌లోని అనేక ఇతర బౌద్ధ స్థలాల నుండి సేకరించిన కొన్ని పురాతన వస్తువులు కూడా ప్రదర్శనలో ఉన్నాయి. ఇక్కడ బుద్ధుని గంభీరమైన, జీవిత-పరిణామ విగ్రహం కూడా ఉంది. మ్యూజియంలోని ఇతర శిల్పాలలో యక్షి, బోధిసత్వ పద్మపాణి మరియు సాలభంజిక (స్త్రీల శైలీకృత విగ్రహాలు) ఉన్నాయి. ధరణి కోటలో లభ్యమైన నాణేలు, పూసలు, గోపురం, డ్రమ్ స్లాబ్‌లు, టెర్రకోట బొమ్మలు, కుండలు, చెక్కిన స్తంభాలు కూడా ప్రదర్శనలో ఉన్నాయి. ఇది 1797లో కల్నల్ కోలిన్ మెకెంజీచే కనుగొనబడింది. తర్వాత, అనేక యూరోపియన్ అధికారులు ఈ ప్రదేశంలో కనిపించే శిల్పాలపై ఆసక్తిని కనబరిచారు. నిర్మాణాన్ని త్రవ్వడానికి కూడా ప్రయత్నిం చారు. త్రవ్వకాల్లో రాతి పనిముట్లు కూడా లభించాయి, మహాచైత్య స్థల చరిత్ర పూర్వ కాలం నాటిది. మహాచైత్యంలో త్రవ్విన శిల్పాలు మద్రాస్ మ్యూజియం, బ్రిటిష్ మ్యూజియంలో ప్రదర్శించబడ్డాయి.

కృష్ణ ఒడ్డునే ఉన్న అమరేశ్వరాలయం పంచారామా లలో ఒకటి. ఇక్కడ జరిగిన కాలచక్ర ఈవెంట్‌కి ప్రపంచ వ్యాప్తంగా బౌద్ధులు లక్షల సంఖ్యలో వచ్చారు. దలైలామా కూడా హాజరయ్యారు. ధ్యానబుద్ధ నిర్మాణం తర్వాత బౌద్ధ ప్రేమికులకు, శిల్ప కళాప్రియులకు, ప్రశాంతతను ఇష్టపడే వారికి అమరావతి ప్రియమైన పర్యాటక ప్రాంతంగా మారింది.

జుగాష్ విలి

నాటిక

# జై విజ్ఞాన్



(రాజు వేషంలో ఒక విద్యార్థి,
మంత్రి వేషంలో ఒక విద్యార్థి ప్రవేశిస్తారు...)

రాజు : ఏమోయ్? మంత్రి ఎక్కడ?

మంత్రి : ఆ... రాజావారు! చెప్పండి, ఇక్కడే!

రాజు : మనం ఈ రోజు కొత్త విషయం మీద మాట్లాడుకుందామని నిన్ను పిలిపించాను.

మంత్రి : ఏమైనా కథ చెప్తారా! ఏంది?

రాజు : కథలాంటిదేనోయ్ - కానీ చెప్పను, చూపిస్తాను. నేనూ నువ్వూ కలిసి ఈ కథను నడిపించాలి, అందరికీ చూపించాలి ఏమంటావ్?

మంత్రి : ఏమంటాను! మీరు సై అంటే నేను సై సై అంటాను! ఇంతకూ మనం ఏ కథను చూపించబోతున్నాం - రాజుల కథనా, పురాణాల కథనా... ఇంకా...?

రాజు : ఆగాగు - అవన్నీ ఎప్పుడూ చెప్పేవి. ఇప్పుడు మనం చూపించబోయేది నేటి మనిషి కథ! విజ్ఞానం ద్వారా మనిషి సాధించిన మానవ ప్రగతి కథ చూద్దామా...

మంత్రి : చూపించండీ...

రాజు : అదిగో! అది 2020 సంవత్సరం - ప్రశాంతంగా సాగిపోతున్న ప్రపంచాన్ని ఉలిక్కిపడేలా చేసింది కరోనా మహమ్మారి. చూడు, అది ప్రపంచ దేశాలను ఎట్లా వణికిస్తుందో...?

(దృశ్యం : 1)
(- మెడలో "కరోనా" ట్యాగుతో ఒకరు - ఇద్దరు, ముగ్గురు గుంపుగా వస్తారు. ఒకరి మెడలో అమెరికా ట్యాగు, వాళ్ల వద్దకు ఓ కరోనా వేషధారి వచ్చి భయపెట్టిస్తారు.)

రాజు : చూసావా! కరోనా చైనా, అమెరికా, రష్యా, ఇతర అన్ని దేశాలను వణికిస్తూ "అదిగో" మన 'ఇండియా' వైపుకు దూసుకు వస్తోంది.

మంత్రి : అయ్యో! మరి ఇపుడు మన నేతలు ఏం చేస్తారు ప్రజలను ఎలా రక్షించుకుంటారు.

రాజు : నిన్ననే మన దేశ ప్రధాని దేశమంతటా 'లాక్‌డౌన్' ప్రకటించారు. (లాక్‌డౌన్... లాక్‌డౌన్... అంటూ ప్రజలందరూ ఎక్కడి కక్కడ ఆగిపోతారు.)


మంత్రి : ఇలా 'లాక్‌డౌన్' పెడితే ప్రజలకు ఏం లాభం?



రాజు : ఓయి... ఈ లాక్‌డౌన్‌లో ప్రజలందరూ ఎవరి ఇళ్ళలో వాళ్ళే ఉంటారు. అప్పుడు ఈ అంటు వ్యాధి 'చైన్' తెగిపోతుంది, దాని ప్రభావం కూడా తగ్గుతుంది.

మంత్రి : అంతేనా... ఇంకేమన్నా దీర్ఘకాల ప్రయోజనం ఏదైనా ఉందా?

రాజు : ఉంది - అటు చూడూ, మన విజ్ఞాన వేత్తలు, శాస్త్రవేత్తలు 'కరోనా'ను ఎదుర్కొనే 'వ్యాక్సిన్' కోసం ప్రయోగాలు చేస్తున్నారు. (కొందరు ప్రయోగాలు చేస్తుంటారు)



మంత్రి : మరి సాధారణ ప్రజలు ఏం చేస్తున్నారు? ఈ 'కరోనా' జాగ్రత్తలు ఎలా పాటిస్తున్నారు?

రాజు : అటు విను ఆ డాక్టరు ఏమంటున్నాడో...

డాక్టరు : చేతులు శుభ్రంగా కడుక్కోండి...

భౌతిక దూరం పాటించండి...

మాస్కులు ధరించండి...

బయట గుంపులుగా తిరగొద్దు...

మంత్రి : ఇంకా ఎవరెవరు ఏం ఏం చేస్తున్నారు.

రాజు : అటు చూడూ, పోలీసులు ప్రజలను బయటకు రాకుండా ఎలా కట్టడి చేస్తున్నారో.

- ఒక కర్ర పట్టుకొని అందర్నీ బయటకు రాకుండా చేస్తున్నారు.

- పారిశుద్ధ్య కార్మికులు - వీధులను వెంట వెంటనే శుభ్రం చేస్తున్నారు.

- కవులూ, కళాకారులు తమ రచనల చేత కళా ప్రదర్శనల చేత ప్రజలకు కరోనా గురించి చైతన్యం తెస్తున్నారు.

మంత్రి : ఇప్పుడు ఈ సమయంలో కరోనా ఏం చేస్తోంది.

రాజు : ప్రపంచాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తూ, వేల మందిని పొట్టన పెట్టుకుంటోంది. మన దేశంలో 'సెకండ్ వేవ్' చాలా నష్టాన్ని కలిగించింది.

మంత్రి : ఐతే మన ఇండియా పని కూడా అయి పోయినట్లేనా...

రాజు : కానే కాదు - ప్రపంచ దేశాలతో పోల్చి నట్లయితే మనకు అంత నష్టం జరుగలే...

మంత్రి : ఎందుకనీ...

రాజు : దానికి కారణం, మన ఆహార అలవాట్లూ, ఆయుర్వేద మందులూ, ఇంటి వైద్యం - అన్నింటికీ మించి ప్రభుత్వం, శాస్త్రవేత్తలు కల్గించిన చైతన్యం.

మంత్రి : మరిచాను మన వ్యాక్సిన్ తయారీ ఎంత దాకా వచ్చింది?

రాజు : ఆ ముచ్చటకే వస్తున్నా, దాదాపు ఒకటిన్నర సంవత్సరాల వేగవంతమైన కృషితో ప్రపంచం అంతా ఆశ్చర్యపడేట్లు మన భారతీయ శాస్త్రవేత్తలు "కొవ్యాక్సిన్"ను తయారు చేసి మనకి అందించారు.



## నాటిక

(అందరు : "కొవ్యాక్సిన్"... "కొవ్యాక్సిన్"... అంటూ అరుస్తారు.)

మంత్రి : హమ్మయ్య! ఒక్క "డోస్"తోనే మనం కరోనాను తరిమేసాం.

రాజు : నువ్వే చూడు... కరోనా దాడి చేసినా వ్యాక్సిన్ మూలంగా ఇండియా గెలుపు సాధించింది.

మంత్రి : వాహ్, శభాష్... ఇండియా గెలిచిందన్న మాట.

రాజు : ఔను! ఐతే ఒక 'డోసు' టీకాతోనే సరిపుచ్చు కోకుండా, రెండవ, మూడవ విడతలుగా కూడా మన దేశ ప్రజలందరికి టీకాలు ప్రభుత్వం ఇవ్వడం వల్ల నేడు 'కరోనా' దాదాపు సమసి పోయింది.

మంత్రి : మన దేశంలో ఒకప్పుడు వేగంగా వ్యాపించిన 'కరోనా' ఇపుడు ఎలా ఉంది?

రాజు : అటు చూడూ... (కరోనా ట్యాగ్ ధరించిన పాత్ర నెమ్మదిగా కుంటుకుంటూ, నీరసంగా వెళ్లిపోతుంది)

మంత్రి : సూపర్.. ఇదంతా ఎవరి విజయమంటారు?

రాజు : మన విజ్ఞానం సాధించిన విజయం. మన సైన్సు సాధించిన విజయం.

అందరు కలిసి : జై విజ్ఞాన్... జై భారత్ (3సార్లు అంటూ అందరూ నిష్క్రమిస్తారు...)

(ఎస్సీఆర్టీ వారి సైన్స్ డ్రామా పోటీల్లో జిల్లాలో ప్రథమంగా నిలిచి హైదరాబాద్‌లో రాష్ట్ర స్థాయిలో విద్యార్థుల చేత ప్రదర్శింపబడింది.)

– డా॥ కాసర్ల నరేశ్‌రావు
m : 94414 06252

## శతకం

# వేమన పద్యాలు

**రాతిబొమ్మ కేల రంగైన వలువలు**
**గుళ్లు గోపురములు కుంభములును**
**కూడు గుడ్డ తాను గోరునా దైవంబు**
**విశ్వదాభిరామ వినురవేమ!**

రాతి బొమ్మలను వస్త్రాలు, గుడులు, గోపురాలు, నైవేద్యాలు అవసరం లేదు. కూడు, గుడ్డ దేవుడు ఏమీ కోరుకోడు. అవన్నీ మనం కల్పించినవే...!

**చిప్పలోనఁబడ్డ చినుకు ముత్యం బాయె**
**నీళ్ళలోనఁగలిసి నీరె యాయె**
**ప్రాప్తము గల చోట ఫలమేల దప్పురా**
**విశ్వదాభిరామ వినుర వేమ!**

స్వాతి కార్తె యందు వర్షపు బిందువు చిప్పయందు పడినచో ముత్యము అవును. నీటి యందు పడినచొ నీటిలో కలిసి పోవును. ప్రాప్తి ఉన్నచో అదృష్టము ఎక్కడికి పోదు.



కథ

# ఎవరు గొప్ప



అనగనగా ఒక అడవిలో ఒక నక్క కొత్తగా పెట్టిన భోజనశాలను మృగరాజు సింహంతో ప్రారంభోత్సవం చేయించింది తన భోజనశాలకు గొప్ప గొప్ప జంతువులను ప్రత్యేకంగా ఆహ్వానించింది. మెడలో మణులు పొదిగిన హారాన్ని వేసుకొని హుందాగా నడుచుకుంటూ ఎలుగుబంటి వచ్చింది. ఎలుగుబంటిని చూసి సంబరపడింది. భల్లూకరాజా! భల్లూకరాజా! రండి! రండి! విందు చేయండి!'' అని ఎదురు వెళ్ళి ఆహ్వానించింది ఎలుగుబంటి. కడుపు పగిలేలా చాపల పులుసు, రొయ్యల కూర వేసుకొని తిన్నది ఎలుగుబంటి. విందుకు చాలా బాగుందని మెచ్చుకుంది ఎలుగుబంటి. మూతి తుడుచుకొని ముందుకు కదిలింది. కొద్దిసేపటి మెడలో వజ్రాల హారం, చేతికి బంగారు కడియంతో తొండం ఊపుకుంటూ తినటానికి వచ్చింది ఏనుగు.

“గజరాజా! గజరాజా!! విచ్చేయండి! విచ్చేయండి!'' అని లోనికి తోలుకొని పోయింది నక్క. ఏనుగు ఆనందంగా భోజనానికి కూర్చుంది. గారెలు, బూరెలు పాయసం, పరవాన్నం వడ్డించింది నక్క బొజ్జ నిండా విందు ఆరగించి తొండం తుడుచుకుని వెళ్ళింది ఏనుగు. మరి కొద్ది సేపటికి మెడలో రత్నాలహారం, కాలికి బంగారు కడియం, నడుముకి వడ్డానంతో దర్జాగా నడుచుకుంటూ తినటానికి వచ్చింది పులి. “పులిరాజా! పులిరాజా!! రండి! రండి!” అని లోనికి పిలుచుకు పోయింది నక్క. పొట్ట పగిలేలా విందారగించింది పులి. భోజనం బాగుందంటూ మెచ్చుకొని పొట్ట రుద్దుకుంటూ వెనక్కి వెళ్ళింది పులి. మణిహారం, వజ్రాలహారం, రత్నాలహారం ధరించి వచ్చిన గొప్ప జంతువులు దర్జాగా తిని వెళ్లాక, బోసి మెడతో కోతి వచ్చింది. దాని చేతిలోని కానుకను నక్కకు అందించి అభినందనలు తెలిపింది. కమ్మటి విందు కడుపునిండా ఆరగించింది. విందు గొప్పగా ఉందని మెచ్చుకుంది కోతి. “మిత్రమా! ఇలాంటి భోజనం చేసి ఎంతోకాలమైంది. అన్ని వంటలూ రుచిగా ఉన్నాయి!” అని మెచ్చుకుని వద్దంటున్నా ఖర్చులకు ఉంచమని ధనాన్ని అందించి వెనుతిరిగింది కోతి. అలా నడుచుకుంటూ పోతున్న కోతి ఎంతో గొప్పగా నక్కకు కనిపించింది. “సొమ్ములు తగిలించుకుని తిరిగితే రాదు గొప్పతనం... ఉన్నదాంట్లోంచి ఇతరులకు ఇచ్చే గుణం ఉన్నవారే గొప్పవారు!!” అనుకుంది బోణీ డబ్బులు కళ్లకు అద్దకుంటూ నక్క.

– పైడిమర్రి రామకృష్ణ
m : 92475 64699

## కవిత

# స్ఫూర్తిదాతలు కడలి కెరటాలు



ఎగసిపడే కెరటాల
పోరాటమే గొప్పది
తీరం చేరాలనే
ఆరాటం సడలనిది

పడి పడి లేచి లేచి
దరిని ముద్దాడుతాయి
ఆటంకాలెదురైనా
ప్రయత్నమే చేస్తాయి


అపజయాలు వచ్చినా
విజయాలు వరిస్తాయి
సముద్రపు అలలు మనకు
పూర్తి స్ఫూర్తినిస్తాయి

నిరంతర ప్రయత్నాలు
విజయానికి మార్గాలు
అహర్నిశల సాధనలు
పరిపూర్ణత సాధనాలు

– గద్వాల సోమన్న
ఎమ్మిగనూరు, కర్నూలు
m : 9966414580

## పంచతంత్ర కథలు

# నక్క అత్యాశ



ఒక అడవిలో ఒక వేటగాడు ఉండేవాడు. అతడు విల్లంబులు ధరించి ఒక రోజు వేటకు వెళ్లాడు. అడవిలో మాటు వేసి ఒక జింకను చంపాడు. ఆ జింకను మోసుకుని వెళుతూ ఉండగా, ఒక అడవి పంది వాడికి ఎదురు వచ్చింది. వేటగాడు ఆ పంది మీద గురిపెట్టి బాణం వేశాడు. బాణం దెబ్బకు ఆ పంది బాగా గాయపడింది. కాని అది 'ఘుర్‌ఘుర్' మంటూ ఆ వేటగాడిపై దూకి వాణ్ణి తన కోరల్తో పొడిచి చంపేసింది. కానీ బాణం దెబ్బకు ఆ పంది కూడా అక్కడే పడి మరణించింది.

కొంత సేపటికి అక్కడికి ఒక నక్క వచ్చి, అక్కడ మరణించిన జింక, వేటగాడు, అడవి పంది శవాలను చూసింది. కొన్ని నెలల వరకూ తనకు ఆహారానికి లోటు లేదని సంబరపడింది. కానీ పిసినారితనంతో, ఎదురుగా ఉన్న అంత మంచి మాంసాన్ని తినకుండా, "ముందుగా వింటినారిని కొరికి తింటే ఈ రోజుకు సరిపోతుంది కదా" అనుకొంది. నక్క ఇలా అనుకుని ఆ వింటిత్రాడు కొరికింది. వంకరగా ఉండే ఆ వింటిబద్ద వెంటనే "ధన్"మని చక్కబడి నక్క గొంతులో దిగబడింది. ఆ దెబ్బకు నక్క మరణించింది.

**నీతి: అత్యాశ పనికి రాదు.**

# వేప చెట్టు



హాయ్ బాలలూ...! బాగున్నారా..! ఈ నెల బాల చెలిమి సంచికలో వేప చెట్ల గురించి తెలుసుకుందాం. పర్యావరణం మిత్రగా పేరు గాంచిన వేప చెట్లు మానవాళికి ఎంతో ఉపయోగకరం. ఎన్నో ఔషధ గుణాలు కలిగి ఉన్న ఈ చెట్లు భారత ఉప ఖండంతో పాటు దాదాపు 30 దేశాలలో కనిపిస్తాయి. 30 మీటర్ల ఎత్తు వరకు పెరుగుతూ 200 సంవత్సరాల జీవిత కాలం జీవిస్తాయి.


వేప చెట్ల గాలి పీల్చినా ఆరోగ్యానికి ఎంతో శ్రేయస్కరం. వేప చెట్లను సాక్షాత్తు లక్ష్మీదేవిగా పూజిస్తారు. కొన్ని ప్రాంతాలలో ఎల్లమ్మ తల్లిగా కూడా కొలుస్తారు. వేప పుల్లలతో దంతాలను తోముకోవడం అనాదిగా వస్తుంది. ఇప్పటికీ చాలా ప్రాంతాల్లో ఆరోగ్యరీత్యా వేప పుల్లలను వాడుతూనే ఉన్నారు. వేప ఆకులను,కాయలను మెత్తగా దంచి మొక్కలకు ఎరువులుగా ఉపయోగిస్తున్నారు. అంతేకాకుండా చీడపీడల నుండి పండ్ల చెట్ల రక్షణ కొరకు పిచ్ కారిగా కూడా ఉపయోగిస్తున్నారు. బియ్యంలో వేపాకులను వేయడం వల్ల పురుగు రాకుండా ఉంటుంది. ఉగాది పండుగ రోజున వేపపూతతో పచ్చడి తాగడం ఆరోగ్యపరంగా ఎంతో మంచిది. వేప నూనెను సబ్బుల తయారీలోనూ, షాంపోల వాడకంలోనూ అనేక పరిశ్రమలలో వాడుతారు. వేప మండలను పర్వదినాలలో దర్వాజాలకు తోరణాలుగా కడతారు. దీనివల్ల బ్యాక్టీరియా ఇంటిలోనికి ప్రవేశించకుండా ఉంటుంది. వేప మండలను పట్టుకుని శిగమూగుతూ కొట్టడం వల్ల పట్టిన శని వదులుతుందనే నమ్మకం కూడా ప్రజలలో ఉంది. సర్వరోగ నివారిణిగా పిలువబడే వేప చెట్ల యొక్క ఆకులు, కాయలు, కాండం ప్రతి భాగం ఉపయోగపడుతుంది. దీని కలపతో అవసరమైన ఫర్నిచర్ తయారు చేస్తారు. భూలోకంలో వేప చెట్టును నాటితే స్వర్గలోక ప్రాప్తి లభిస్తుందని నమ్మిక కూడా ఉంది. స్త్రీలకు ప్రతిరూపంగా భావించే వేప చెట్లు పర్యావరణానికి ఎంతో మేలు చేస్తాయి. అందుకే ప్రతి ఒక్కరం వేప చెట్లను నాటుదాం. పర్యావరణాన్ని కాపాడుకుందాం.


– కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి
m : 9441561655



# గాలిలో గమ్మత్తు

రచన : చొక్కాపు వెంకటరమణ,
m : 9246520050
బొమ్మలు : టి. గంగాధర్
m :7702037198






1991 బాలచెలిమి కథల సంచిక నుండి



## బొమ్మకు అమ్మ

అమ్మా! నాకూ బొమ్మా ఒకటి తెచ్చీ ఇస్తావా?
బొమ్మా పాపకు కమ్మా కమ్మని కథలూ చెపుతాను!
బొట్టు పెట్టీ జుట్టూ దువ్వీ జడలూ వేస్తాను!
నువ్వు నాకు అమ్మవు అయితే
బొమ్మకు నేను అమ్మను అవుతా!

## ఇప్పుడే వస్తా

అమ్మా! అమ్మా! ఇప్పుడే వస్తా!
అన్నీ చూసి చిటికెలో వస్తా!
అన్నతోటి అడవికి పోతా!
అడవిలోని జింకను చూస్తా!
నాన్నతోటి తోటకు పోతా!
ఉడత తోటి నేస్తం కడతా!
చెప్పకుండా చెరువుకు పోతా!
గాలం వేసి చేపలు పడతా!
బస్సు ఎక్కి ఊరికి పోతా!
ఊరూ ఊరూ తిరిగీ వస్తా!



## ఎక్కువ

సీతకోక చిలుకకు చీరలెక్కువ!
బండి రామచిలకకు పలుకులెక్కువ!
గండు కోయిలమ్మకు పాట లెక్కువ!
మా బుజ్జి పాపకు ఏడుపు ఎక్కువ!



## పావురమా!

రావే రావే పావురమా!
తెల్ల తెల్లనీ పావురమా!
శాంతికి గుర్తు పావురమా!
ముచ్చటైన పావురమా!
అమ్మను అడిగి గింజలు తెచ్చా
అక్కను అడిగి నీళ్ళను తెచ్చా
పెద్ద గిన్నెలో గింజలు వేస్తా
చిన్న గిన్నెలో గింజలు వేస్తా
చిన్న గిన్నెలో నీళ్ళను పోస్తా
గింజలు తినేసి వెళ్ళిపో!
నీళ్ళు తాగేసి ఎగిరిపో!

– పిల్లల పాటల పరిమళం
(తెలంగాణ సారస్వత పరిషత్తు )



# రాళ్ళు కొట్టే మనిషి కథ

అనగనగా ఒక ఊరిలో ఓ మనిషి నివసించే వాడు. అతను ఊరికి దగ్గరలోని క్వారీలో రాళ్ళు పగలకొడుతూ, దాంతో సంపాదించిన కొద్దిపాటి డబ్బుతో జీవనం సాగించేవాడు.

ఒక రోజు అతను యథావిధిగా రాళ్ళు పగలు కొట్టే పనిలో మునిగి ఉన్నాడు. ప్రస్తుతం అతను ఓ పెద్ద కొండని పగులకొడుతున్నాడు. ఉన్నట్టుండి అతనికి పెద్ద పెద్ద అరుపులు, కేకలు వినిపించాయి. తన తోటి పనివాళ్ళు హడావిడిగా అటు ఇటూ పరిగెడుతున్నారు. "మహారాజు గారు వేంచేస్తున్నారహో" అన్న వార్త నలుదిక్కులా చేరింది.

కొద్ది క్షణాల తరువాత, తెల్ల ఏనుగుపై ఠీవిగా ఊరేగుతూ మహారాజు వస్తున్నారు. రాళ్ళు కొట్టే వ్యక్తి మోకాళ్ళపై వంగి రాజు గారికి నమస్కరించాడు. మిగిలిన వాళ్ళు కూడా వంగి వంగి దండాలు పెట్టారు.

కానీ మహారాజు ఎవ్వరిని పట్టించుకోలేదు. వాళ్ళ వైపు కూడా చూడలేదు. ఇది రాళ్ళు కొట్టే మనిషిని బాధించింది. "మహారాజు గారు నన్ను కన్నెత్తి కూడా చూడలేదు. నేను మోకాళ్ళపై వంగి దండం పెట్టింది తెల్ల ఏనుగుకు" అని మనసులో అనుకున్నాడు.

"నేను ఎంత దురదృష్టవంతుడిని, నాకు గడ్డి పోచకు ఉన్న విలువ కూడా లేదు. ఏనుగు జీవితమే చాలా బాగుంది. అది చాలా అదృష్టవంతురాలు. ఎంచక్కా గర్వంగా మహారాజుని మోస్తుంది. నేను ఏనుగులా మారితే ఎంత బాగుంటుంది" అని మనసులో కోరుకున్నాడు.

ఆశ్చర్యం! మరుక్షణం రాళ్ళు కొట్టే మనిషి తెల్ల ఏనుగులా మారిపోయాడు. ఆ ఏనుగుపై మహారాజు ఊరేగుతున్నాడు. ఉన్నట్టుండి రాజు గారు సేవిస్తున్న తేనేరు ఒలికింది. ఏనుగుకు కోపం వచ్చింది.

"నేను ఏనుగునై మహారాజుని మోయడం ఎంత బాధాకరం. ఇది బానిస జీవితం. ఎంచక్కా ఈ దేశ మహారాజుగా మారితే ఎంత బాగుంటుంది" అని మనసులో కోరుకున్నాడు.

అద్భుతం! మరుక్షణం మహారాజులా మారిపోయాడు. ఠీవిగా తేనీరు సేవిస్తూ, తెల్ల ఏనుగు పై ప్రయాణిస్తూ, దేశప్రజల నుండి గౌరవాన్ని స్వీకరిస్తూ ప్రయాణించాడు. కొందరు రాజోద్యోగులపై తన దర్పాన్ని ప్రదర్శించాడు. కోప్పడ్డాడు. వాళ్ళు రాజు మాటల్ని శిరసావహించారు.

అలా ప్రయాణిస్తుండగా, సూర్యుడు నడి నెత్తి మీదకు వచ్చాడు. సూర్య కిరణాలు సరాసరి మహారాజు కంట్లో పడ్డాయి. మహారాజు రూపంలో ఉన్న రాళ్ళు కొట్టే మనిషికి ఇది చిరాకుగా అనిపించింది.

"రాజునైన నన్నే సూర్యుడు ఇబ్బంది పెడుతున్నాడు అంటే మహారాజు కంటే సూర్యుడు బలవంతుడన్న మాట. నేను సూర్యుడినైతే ఎంత బాగుండు" అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం సూర్యుడిలా మారిపోయాడు. సూర్య కిరణాలు వెచ్చగా భూమిని తాకాయి. భూమి వేడిగా మారిపోయింది. సూర్యుడి నుండి వెలువడే వేడి ఆ చుట్టు ప్రక్కల అంతా వ్యాపించింది. ఆకాశంలో కొన్ని చల్లటి మేఘాలు సూర్యుడికి అడ్డుగా ప్రయాణించాయి.

"ఈ వేడి శరీరాన్ని నేను భరించలేను. ఎంచక్కా చల్లని మేఘంలా మారితే ఎంత బాగుండు" అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం చల్లటి మేఘంలా మారిపోయాడు. హాయిగా అనిపించింది. ఈ మేఘాలు ఆకాశం అంతా వ్యాపించాయి.

ఉన్నట్టుండి ఓ గాలి తీవ్రంగా వచ్చి మేఘాల్ని విడదీసింది. "మేఘం కంటే గాలి శక్తివంతురాలు లాగుంది. నేను గాలిలా మారితే ఎంత బాగుండు" అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం గాలిలా మారిపోయాడు. ఆ సుడిగాలి భూమిపై తీవ్రంగా వీచింది. దాని ఉధృతికి చెట్లు విరిగాయి, ఇంటి పై కప్పులు ఎగిరిపోయాయి. కాని గాలి ఓ ఎత్తైన కొండను ఢీకొనగానే చిన్న చిన్న ముక్కలై పోయింది. "గాలి కంటే కొండ శక్తివంతురాలు లావుంది. నేను ఈ ఎత్తైన కొండలా మారిపోతే బావుండు" అని కోరుకున్నాడు. వెంటనే ఎత్తైన కొండలా మారిపోయాడు. అది ఎంత పెద్ద కొండ అంటే, ఆకాశాన్ని తాకేంత ఎత్తైనది. దాని ముందు ఇళ్ళు, మనుషులు చిన్న చిన్న చీమల్లా కనిపిస్తున్నారు.

ఓ రాళ్ళు కొట్టే మనిషి, తన బలమైన చేతులతో, పదునైన గొడ్డలితో కొండను పగలకొడుతున్నాడు. ఇది గమనించిన కొండ ఇలా అనుకుంది.

"ఇంత పెద్ద కొండని అంత చిన్న మనిషి ఎలా పగులకొడుతున్నాడు. అంటే అన్నింటికంటే శక్తివంతుడు మనిషి. కాబట్టి నేను తిరిగి రాళ్ళు కొట్టే మనిషిగా మారితే ఎంత బాగుండు" అని మనసులో కోరుకున్నాడు.

మరుక్షణం తిరిగి క్వారీలో రాళ్ళు కొట్టే మనిషిగా మారిపోయాడు.

ఉన్నట్టుండి అతనికి పెద్ద పెద్ద అరుపులు, కేకలు వినిపించాయి. తన తోటి పని వాళ్ళు అటు ఇటూ పరిగెడుతున్నారు. "మహారాజు గారు వేంచేస్తున్నార హో" అన్న వార్త నలుదిక్కులా చేరింది. రాళ్ళు కొట్టే మనిషి మనసులో ఇలా అనుకున్నాడు. "ఏనుగు, రాజు, సూర్యుడు, మేఘం, గాలి, కొండ... ఇవేమి నాకు వద్దు. నేను నా మోకాళ్ళపై వంగి నమస్కరించను" అనుకున్నాడు. అతను వంగి రాజుకి నమస్కరించలేదు. అతన్ని అలా చేయమని ఎవరూ బలవంతపెట్టనూ లేదు.

అలా రాళ్ళు కొట్టే మనిషి కష్టించి పని చేస్తూ, ఉన్న దాంతో సంతృప్తి పడుతూ ఆనందంగా జీవించాడు.

స్వేచ్ఛానువాదం : **అనిల్ బత్తుల**
m : 8179273974
ఇంగ్లీష్ : ఎ లెజెండ్ ఆఫ్ స్టోన్ కట్టర్
రైటర్ : ఎ. వినోకురావ్, రష్యన్ జానపద కథలు

సైన్స్

# కాగితంలో నీళ్లు మరిగించడం

నీళ్లు కాచుకోవడానికి గిన్నెగానీ, కుండగానీ ఉపయోగించడం విన్నాం గానీ, కాగితాన్ని ఉపయోగించడం ఎక్కడా ఎరగం. కాగితాన్ని నిప్పుల మీద పెట్టి పెట్టగానే మసి అయిపోదూ? చూద్దాం. ఈ గారడీ చెయ్యడానికి పాత పోస్ట్‌కార్డు, నాలుగు గుండుసూదులు, లేదా పేపరు క్లిప్పులు, కొవ్వొత్తి కావాలి. పోస్టుకార్డుకి చుట్టూ ఒక అర అంగుళం వెడల్పున మార్జిను గీసి, ఆ గీతల వెంబడి మడతలు పెట్టి, దొన్నెలాగ చెయ్యాలి. అవసరం అయితే నాలుగు మూలలా గుండు సూదుల్ని పేపరు క్లిప్పుల్లో గుచ్చి, దొన్నె విడిపోకుండా గట్టిగా ఉండేటట్లు చెయ్యాలి.

కొవ్వొత్తి వెలిగించి, నేలమీద నిలబెట్టు. తయారు చేసిన కాగితపు దొన్నెలో సగంపైగా నీళ్ళు పోసి, దానిని కొవ్వొత్తి మంటమీద పెట్టి, పట్టుకో. కాగితం కాలి, చిల్లుపడి నీళ్ళు బయటికి కారిపోతాయనే భయం అక్కరలేదు. కాగితం కాలదు. మసి అంటుకుంటుంది అంతే. త్వరలోనే దొన్నెలోని నీళ్ళు మరగడం మొదలు పెడతాయి.

ఇది ఎలా సాధ్యమైందీ? కాగితం ఎందుకు కాలి పోలేదూ? దొన్నెలో ఉన్న నీళ్లే ఇందుకు కారణం. నీళ్లు మంట వేడిని పీల్చుకుని, కాగితాన్ని చల్లబరుస్తూ ఉంటాయి.

వంద డిగ్రీలు సెంటిగ్రేడు ఉష్ణోగ్రత వద్ద నీళ్ళు మరుగుతాయని మనకు తెలుసు. ఇంకా మంట పెడితే నీళ్ళు ఆవిరి అయిపోతూ ఉంటాయే కాని, వాటి ఉష్ణోగ్రత మాత్రం పెరగదు. ఈ కారణం వల్ల నీళ్ళు ఉన్న కాగితపు ఉష్ణోగ్రత $100^0$ సెంటీగ్రేడు దాటి పెరగదు. కాగితం మండడానికి ఈ ఉష్ణోగ్రత చాలదు. కాబట్టి దొన్నెలో నీళ్ళు ఉన్నంతసేపూ కాగితం కాలదు; చిల్లు పడదు.

– డాక్టర్ మహీధర నళినీ మోహన్

మార్చ్ 1991, బాలచెలిమి కథల సంచిక నుండి



కథ




# దుష్టులకు దూరంగా ఉండు

ఒకానొక అడవిలో ఒక హంస ఉంది. అది సమీపంలోని సరస్సులో విహరిస్తూ గడిపేది. కొంత కాలానికి ఒక కాకి అక్కడకు వచ్చింది. హంసను చూసిన కాకి దానితో ఎలాగైనా స్నేహం చేయాలనుకుంది. ఓ రోజు కాకి ఆ హంస దగ్గరికి వెళ్ళి వినయంగా “అయ్యా! హంసగారు! నేను నీలపర్ణుడనే కాకిని. ఎంతో కాలం నుండి ఎక్కడెక్కడో తిరిగి పొట్టపోసుకునే వాడిని. ఎందుకో మిమ్ములను చూడగానే మీతో స్నేహం

చేయాలని అనిపించి మీ దగ్గరికి వచ్చాను!" అంది. "ఓహో! అలాగా! కాకులకు, హంసలకు మధ్య జాతివైరం ఉంది. "నాకు, నీకూ స్నేహం కుదరదు. వెళ్ళిపో!" అంది హంస. "లేదు! మీరు అలా అనకండి, జాతివైరం అనేది ఒకప్పటి మాట! ఇప్పుడు కాలం మారిపోయింది... పైగా నేను అలాంటి దానిని కాదు. మీతో స్నేహం చేయాలంటే నాకెంతో ఇష్టం... అని కాకి బతిమాలుకుంది. జాతి వైరాన్ని పక్కన పెట్టి తనకేమైనా అపాయం ఉందా... అని ఆలోచించసాగింది హంస. అయ్యా! తమరు మరీ లోతుగా ఆలోచన చేస్తున్నారు? ఎప్పుడో శతాబ్దాల జాతి వైరం గురించి ఇప్పుడు ఆలోచన చేయడం ఎందుకు? అప్పుడున్న సమయం వేరు - ఇప్పుడున్న కాలం వేరు? కాలం ఎంతో మారిపోయింది. మీరు అంతగా ఆలోచించకండి! నా వల్ల మీకు ఎలాంటి ఇబ్బందీ ఉండదు!" అని కాకి అంది. నేను ఎంత ఆలోచించినా, ఎందుకో నాకు నీతో స్నేహం చేయాలనిపించట్లేదు" అని సమాధానం చెప్పింది హంస. సరే? ఏం చేస్తాం! నా ఖర్మ ఇలా ఉందిలే! అని ఊరుకుంటాను. ఇక వెళతాను" అంది కాకి.

అది చూసి కాకి మీద హంసకి జాలేసి "సరే, మనం ఇప్పటి నుండి స్నేహంగా ఉందాం!" అని హంస అంది. కాకి సంతోషంతో హమ్మయ్య నాకొక స్నేహితుడు లభించాడు. ఇది చాలు! అని అనుకుని "నా స్నేహాన్ని అంగీకరించినందుకు ధన్యవాదాలు. ఇక ముందు మీలోని మంచితనాన్ని చూసి నేను కూడా మంచి పేరు తెచ్చుకుంటాను" అంది. కొన్నాళ్ళకి వేసవి కాలంలో, ఓ రోజు మధ్యాహ్నం పూట ఓ వేటగాడు వేటాడుతూ అలసిపోయి, హంస నివాసం ఉంటున్న మర్రిచెట్టు కింద సేద దీరాడు. వాతావరణం చల్లగా ఉండడంతో అతడు వెంటనే గాఢ నిద్రలోకి వెళ్ళిపోయాడు. చెట్టు కొమ్మల సందుల్లోంచి ఎండ వచ్చి వేటగాడి మీద పడుతుండడం చూసి హంస తన రెక్కలను చాచి అతని మీద ఎండ పడకుండా చేస్తోంది. ఇంతలో అక్కడికి కాకి వచ్చింది. హంస చేస్తున్న ప్రయత్నాన్ని చూసి, "అయ్యో! హంసరాజా! వాడు వేటగాడు! మనకు విరోధి! అలాంటి విరోధికి నీవు ఎండ పడకుండా సహాయం చేస్తున్నావా? ఎంత విచిత్రం ఇది?" అంది.

"విరోధి అయినా, స్నేహితుడు అయినా మన అవసరం వచ్చినప్పుడు సహాయం చేయడం మన కర్తవ్యం!" అంది హంస.

నీవు పిచ్చిదానివి, విరోధికి సహాయం చేయడం ఏమిటి? అది నీ తెలివి తక్కువ తనం కాకపోతే! అని అంటూ కాకి రెట్ట వేసుకుంటూ ఎగిరిపోయింది.

ఆ రెట్ట సరిగ్గా వేటగాడి ముఖం మీద పడడంతో, గాఢనిద్రలో ఉన్న వేటగాడు ఒక్కసారిగా ఉలిక్కిపడి లేచాడు. ముఖం మీద పక్షి రెట్ట చూసుకున్నాడు. కోపంతో పైకి చూశాడు. పైన కొమ్మ మీద హంస కూర్చుని ఉంది. రెట్ట వేసింది అదే అనుకుని చటుక్కున లేచి పక్కనే పెట్టుకున్న విల్లు తీసి బాణం సంధించి హంసకేసి వదిలాడు. క్షణంలో ఆ దెబ్బకు కొమ్మ మీద నుండి నేల మీద పడి గిలగిలా కొట్టుకొని చనిపోయింది హంస.

చూశారుగా! పరోపకారి అయిన హంసను దుష్టబుద్ధి గల కాకి ఎంత నష్టపరిచిందో? అందుకే దుష్టులతో స్నేహం చేయకూడదు. చేస్తే ప్రాణాలకే ముప్పు ఏర్పడుతుంది.

– డి. ఆకాంక్ష
8వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్

# పండు - గుండు

పండు పండు జామపండు,
చిలక కొడితే తీయగవుండు.

పండు పండు అరటి పండు,
ఆపిలు కంటే మంచిగ వుండు.

పండు పండు సీతాఫలం పండు,
లోపలేమో గింజలు వుండు.

పండు పండు మామిడి పండు,
మాగినాకా తిందాముండు.

పండు పండు తిరుపతి గుండు,
చేయి పెడితే జారుతు వుండు.

- ఎం. హరికిషన్





**పిల్లలూ...**

- బొమ్మలు గీసి పంపండి.
- ఫొటోలు తీసి పంపండి.
- కథలు, కవితలు, గేయాలు రాసి పంపండి.
- మీకు నచ్చిన పుస్తకం గురించి రాయండి.
- మీకు నచ్చిన ఆట గురించి రాయండి.
- మీకు తెలిసిన సామెతలు, పొడుపు కథలు, జోక్స్ పంపండి.
- కార్టూన్లు గీస్తారా... అవి కూడా పంపండి.

**వీటితో పాటు మీ ఫొటో, చిరునామా మరవకండి...**

**BALA CHELIMI**
"CHANDRAM" 3-6-712/2, St. No. 12, Himayatnagar, Hyderabad - 500 029.
e-mail : edit. chelimi@gmail. com, www. balchelimi. com, Mob: 98480 44713



# మరో యాదగిరి... మత్స్యగిరి

హైదరాబాద్‌కు 85 కిలోమీటర్ల దూరంలో నల్లగొండ జిల్లాలో ఉన్న మత్స్యగిరి ఒక గొప్ప సందర్శనా స్థలం. ఇక్కడికి హైదరాబాద్ నుండి చౌటుప్పల్, వలిగొండ, ఆరూరు మీదుగా చేరుకోవచ్చు. మరో మార్గంలో భువనగిరి, వలిగొండ మీదుగా కూడా చేరుకోవచ్చు. మత్స్యం అంటే చేప కదా! మత్స్యగిరి చేప ఆకారంలో ఉంటుంది కాబట్టి దానికి ఆ పేరు పెట్టారు. అయితే మత్స్యగిరి దగ్గరున్న పొట్టి గుట్ట దగ్గర్నుండి వెళ్తే ఈ గిరి అచ్చంగా చేప ఆకారంలో కనిపిస్తుంది.

ద్వార బంధానికి ఒక చేప శిల్పం చెక్కి ఉండటం విశేషం. ప్రస్తుతం శిథిలమైనప్పటికీ ఆ శిల్పం సుమారు మూడడుగుల పొడవుంటుంది. మత్స్యగిరి శిఖరాగ్రాన చిన్న చెరువుంది. ఈ చెరువులో చేపలుండడం మరో ముఖ్య విశేషం. ఇందులో ఉండేవన్నీ ఒకే రకపు చేపలు. అవన్నీ ఒకే పరిమాణంలో... సుమారు అర మీటరు పొడవుతో చిన్న డాల్ఫిన్లలాగా గంతులు వేస్తూ కనిపిస్తాయి. ప్రధానాలయానికి ఎగువన (పడమర) చాళుక్యుల కాలం నాటి ఆలయముంది. ఈ ప్రాంతం జైన మత ప్రాబల్యం గలదని చెప్పే శిలాశాసనం ఒకటి ఇక్కడికి దగ్గరలోని సైదాపూర్‌లో లభించింది. ప్రస్తుతం మత్స్యగిరి పైనున్న శివాలయం, పొట్టిగుట్ట పైనున్న ఆలయాల నిర్మాణం ఆనాటి జైన బసదుల నాటిదే. శాసనంలో పేర్కొనబడ్డ ముచ్చనపల్లెయే తరువాతి శతాబ్దాలలో మత్స్యగిరి అయ్యింది. మత్స్యగుండంలోని చేప ముఖం ఉగ్ర నరసింహుని రూపంతో ఉండడం గమనార్హం. మత్స్యగిరికి హైదరాబాద్ నుండి వెళ్ళే యాత్రికులను ప్రయాణ మార్గంలో చౌటుప్పల్ నుండి ఇరుపక్కలా మూడు రంగుల్లో కనిపించే కొండలు ఆకర్షిస్తాయి. అన్నేసి కొండలు రంగురంగుల్లో కనిపిస్తుంటే ప్రయాణ మార్గంలోనే ఒక ఆసక్తికరమైన భావన హృదయాలను పులకరింపచేస్తుంది. వలిగొండకు చేరుకునే ముందు మూడు తోరణాలు కనిపించి మనల్ని మంత్ర ముగ్ధుల్ని చేస్తాయి. మత్స్యగిరి ఎక్కి చూస్తే మన చుట్టూ గొలుసు కట్టు చెరువులు ఏడెనిమిది కనిపిస్తాయి. ఘాట్ రోడ్డు పచ్చని చెట్లమధ్య పారే నల్లని తాచుపాము లాగా వంకర టింకరగా మెలికలు తిరుగుతూ మనల్ని అలరిస్తుంది.

– డా. ద్యావనపల్లి సత్యనారాయణ
m : 94909 57078

## చెలిమి క్లబ్

చెలిమిక్లబ్‌లో సభ్యత్వం తీసుకోండి
లాభాలు పొందండి.

1. చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ ప్రచురించే పుస్తకాలపై ప్రత్యేక తగ్గింపు.
2. మీ ప్రతి పుట్టిన రోజుకు అభినందనలతో అందమైన గ్రీటింగ్ కార్డు.
3. మీలో ఉన్న టాలెంట్‌ను అభివృద్ధి చేసుకోవడానికి క్లబ్ నిర్మాణాత్మక సహకారం అందిస్తుంది.
4. మీ స్కూల్లో, ఊర్లో పిల్లల కార్యక్రమాల వార్తలను చెలిమి సమాచారపత్రికకు పంపడానికి మీరు విలేఖరిగా ఉండవచ్చు.
5. అందమైన మెంబర్‌షిప్ బ్యాడ్జి.
6. మిమ్మల్ని ఆశ్చర్యపరచే బహుమతులు.

### చెలిమి క్లబ్

మెంబర్ షిప్ నెం. : ---------------

పేరు : ----------------------

తండ్రి పేరు : ----------------------

తరగతి : ----------------------

పుట్టినతేదీ : ----------------------

హాబీలు : ----------------------

చిరునామా : ----------------------

----------------------


----------------------

పిన్ : ----------------------

ఇ-మెయిల్ : ---------------------

ఈ వివరాలతో మెయిల్ చేయండి.

బాల చెలిమి ఇ-మెయిల్ :
desk.chelimi@gmail.com



కథ

# మామిడి చెట్టు మూడు కొమ్మలు



మాధవపురం పేరుకు గ్రామ మయినా పట్టణానికి ఏమాత్రం తీసిపోదు. ఊరి చివర మాత్రం తాటాకు కప్పు పూరిల్లు. అది కూడా ఎన్నో ఏళ్ళ క్రిందట కప్పినట్టుంది.

ఆ పూరింట్లో ముగ్గురు అన్నదమ్ములు ఉన్నారు. వాళ్ళ అమ్మనాన్నలు చనిపోయారు. ఈ అనాథలకు మిగిలిందల్లా ఒకే ఒక మామిడి చెట్టు. ఆస్తి అంతా హరించుకు పోయింది. ఉన్న పూరిల్లు కూడా అప్పు క్రింద ఆక్రమించుకున్నారు అప్పిచ్చిన వారు.

అది ఎండా కాలం. ముగ్గురు అన్న దమ్ములకు ఒక మంచి ఆలోచన వచ్చింది. మామిడి పండ్ల కాలం, పైగా వారి మామిడి చెట్టు కూడా మూడే మూడు పెద్ద కొమ్మలతో విరగ కాసి ఉంది. అందుకని ముగ్గురు ఆ మూడు కొమ్మలు తెలివిగా ఒక పెద్ద మనిషితోడు లేకుండా గొడవ లేకుండా పంచుకున్నారు. ప్రధముడు పై కొమ్మ, మధ్యముడు మధ్యకొమ్మ, చిన్నవాడు క్రింది కొమ్మను పంచుకున్నారు. ఇకపోతే వచ్చిన చిక్కల్లా ఏమిటంటే రాత్రులు చెట్టును ఎవరు కాపలా కాయాలి? ఆపనిని కూడా గొడవ లేకుండా వారే పంచుకున్నారు. పెద్దవాడు సోమవారం, మధ్యముడు మంగళవారం, చిన్నవాడు బుధవారం, మరల పెద్దవాడు గురువారం, ఈ విధంగా వంతుల వారీగా రాత్రుళ్ళు కాపలా కాస్తున్నారు.

ఒక రోజు పెద్దవాడు కాపలా కాయుచుండగా మిగిలిన వారు నిద్రపోతున్నారు. ఈ ముగ్గురి మనసత్వాలను తెలుసుకోవాలనుకున్నాడు. వీరికి ఒక ముసలి తాత దూరబంధువు. పెద్దవాడు కాపలా ఉన్న రోజు మధ్యరాత్రి ఆ ముసలి తాత వచ్చి బాబూ ఆకలి అవుతుంది. తింటానికి ఒక మామిడి పండు ఇవ్వవా! అని అడిగాడు. అప్పుడు ఆ పెద్దవాడు లేదు లేదు మేము ముగ్గురం అన్నదమ్ములం అమ్మానాన్నలు లేరూ, ఆస్తి లేదు, ఉన్న ఒక్క మామిడి చెట్టు

పంచుకోగా పై కొమ్మ నాకు భాగంగా వచ్చింది. నీ కిస్తే, నా కాయలు తక్కువ అయిపోవా! అని అన్నాడు. ఆ ముసలతను వెళ్ళిపోయాడు. మధ్యముడి కాపలారోజు కూడా వచ్చి మధ్యరాత్రి ఆ విధంగానే అడిగాడు. అతను కూడా లేవు అన్నాడు. చిన్నవాడు కాపలా ఉన్న రాత్రి కూడా ముసలి తాత వచ్చి అడిగాడు. చిన్నోడు మాత్రం, ఎమన్నాడంటే నీకు ఎన్నికాయలు కావాలో అన్ని తీసుకుని తినమని చెప్పాడు.

అప్పుడు ముసలి తాత మూడు కాయలు తిని తృప్తి చెంది వెళ్ళిపోయాడు. మరునాడు పట్టపగలు ఒంటి గంట సమయంలో, ఆ రాత్రిపూట వచ్చిన ముసలితాత ఈసారి పగటి పూట వచ్చాడు. అప్పుడు ముగ్గురు కలిసి అనుకున్నారు. అరే నేను రాత్రి కాపలా అప్పుడు వచ్చాడు అని, నేను ఉన్నప్పుడు కూడా అని అందరూ అనుకోని చూడగానే దగ్గరకు వచ్చి కూర్చున్నాడు. "మీకు అమ్మానాన్నలు లేరు కదా! నాతో వస్తారా! నాదగ్గర ఉన్నది మీకిస్తాను" అని అన్నాడు. వారు ఒప్పుకుని వెంట వెళ్ళసాగారు.

మొదటగా తనకున్న దానిలో మొదటివాడికి 100 ఎకరాలు పొలం ఇచ్చి సాగు చేసుకోమన్నాడు. రెండవ వాడికి కూడా తనకున్న గేదెలలో 400 గేదెలు పాడిపరిశ్రమ ఏర్పాటు చేసుకోమన్నాడు. మూడవ వాడు, అనగా చిన్నవాడు తనకు మామిడి కాయలిచ్చినవాడు, అందుకని తన మనుమరాళ్ళలోని ఒక అందాల రాశిని, ఉండడానికి అందమైన భవనాన్ని ఇచ్చి రంగ రంగ వైభవంగా వివాహం జరిపించాడు. చిన్నవాడు భవనాలను కట్టించే రంగంలో ఆరి తేరి పోయి, ధనికుడిగా మారి పోయాడు. తరువాత ముసలితాత విశ్రాంతి కోసం విదేశీ పర్యటనకు ఒక ఆరునెలలు వెళ్ళాడు.

విదేశీ పర్యటన ముగించుకుని వచ్చిన ముసలి తాత, ముగ్గురు అనాథలకు తాను అప్పగించిన వ్యాపారాలు, ఏ విధంగా ఉన్నాయో మారు వేషంలో పరీక్షించుదామని ముందుగా పెద్దవాడి గృహానికి వెళ్ళి బాబు దిక్కులేని వాడిని నాకు కొన్ని బియ్యం ఇవ్వండి. వంట చేసుకుంటాను, అనగానే అక్కడవున్న పెద్దవాడు మా దగ్గర కూలిపని చేయి అప్పుడు ఇస్తాం! ఏదయినా అని అన్నాడు. ఆమాట విన్న ముసలితాత మనసుకు ఎంతో గాయమయింది. బయటికి వచ్చి అక్కడ ఉన్న పని వారిని వద్ద వ్యాపారం ఎలా ఉంది. అని వివరాలు అడిగాడు. వ్యాపారం అంతా ఇష్టారాజ్యంగా సాగుతుంది. "గుమ్మడి కాయులు పోయే దారి కనిపించదు వీరికి, ఆవగింజలకి మాత్రం అడ్డు పడుతుంటారు. అని వివరణ ఇచ్చారు. పెద్దవాడు బుద్ధికి తగ్గట్టుగానే ఉంది. అనుకున్నాడు.

తరువాత రెండవ వాడి పాల వ్యాపారం వద్దకు మారు వేషంలో వెళ్ళి కొంత మజ్జిగ వుంటే పోయండి అన్నం తింటాను. అని అంటాడు. మధ్యముడు చూసి పనివాళ్ళతో కొట్టించి అవతలకి వెళ్ళ గొట్టించేశాడు. అప్పుడు తాత ఇది నిలిచే వ్యాపారం కాదులే అనుకుని మూడవ వాడి దగ్గరకు బయలు దేరుతాడు.

చిన్నవాడు భవనాల వ్యాపారంలో అత్యంత ధనికుడై వున్నాడని విని వెళ్ళి, మారువేషంలో, కొంచెం అన్నం ఉంటే పెట్టమని అడుగుతాడు. అప్పుడు ఆ ఇంటి యజమాని గేటు బయటకు వచ్చి అతనిని పరామర్శించి నీకు ఎవరూ లేరా! అని అడుగుతాడు. అప్పుడు తాత అంటాడు. నాకు ఎవరూ లేరు. అనాథని అని అంటాడు. అప్పుడు చిన్నవాడు నేను భవనాల వ్యాపారం చేస్తున్నాను. ఈ భవనం ఖాళీగా ఉంది నువ్వు ఉండిపో నాకు కూడా ఒక తోడులాగా ఉంటావని అని చెప్పి మనస్సులో వెనుకటి లేని తనాన్ని గుర్తు చేసుకున్నాడు.

– జూపూడి జిగీశ
ఖమ్మం

దేశభక్తి గీతం

# ఏ దేశమేగినా ఎందుకాలిడినా

"ఏ దేశమేగినా ఎందు కాలెడినా
ఏ పీఠమెక్కినా, ఎవ్వరేమనినా,
పొగడరా నీ తల్లి భూమి భారతిని,
నిలపరా నీ జాతి నిండు గౌరవము.

లేదురా ఇటువంటి భూదేవి యెందూ
లేరురా మనవంటి పౌరులింకెందు.
సూర్యునీ వెలుతురుల్ సోకునందాక,
ఓడలా ఝుండాలు ఆడునందాక,

ఏ పూర్వ పుణ్యమో, ఏ యోగ బలమో
జనియించినాడ వీ స్వర్గఖండమున
ఏ మంచిపూవులన్ ప్రేమించినావో
నిను మోచె ఈ తల్లి కనక గర్భమున.

అందాక గల ఈ అనంత భూతలిని
మన భూమి వంటి చల్లని తల్లి లేదు
పాడరా నీతెలుగు బాలగీతములు
పాడరా నీ వీర భావ భారతము.



– రాయప్రోలు సుబ్బారావు

# కలంచెలిమి



**చేరాల సాన్వి ప్రియ**
8వ తరగతి,
ఆల్ఫోర్స్ హైస్కూల్,
కరీంనగర్



**ఎస్. కె. నౌషీన్**
పదవ తరగతి, జిల్లా పరిషత్
బాలికల ఉన్నత పాఠశాల
మిర్యాలగూడ, నల్గొండ జిల్లా.

**ఎ. ప్రణవి**
10వ తరగతి,
తెలంగాణ ఆదర్శ పాఠశాల,
బచ్చన్నపేట, జనగామ.



**తల్లెల కీర్తి**
8వతరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
లక్ష్మీపూర్ గ్రామం, ఆదిలాబాద్ జిలా





**లీలావతి**
9వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ఎర్రావారిపాలెం, తిరుపతి జిల్లా.



**వి. ఈశ్వర్**
8వ తరగతి,
జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల,
ఏపూర్.

# విభిన్న వైద్యాలు



అనారోగ్యాల నుంచి మనిషిని కాపాడి స్వస్థత ఇచ్చేందుకు పురాతన కాలం నుంచి ఇప్పటి వరకు అనేక వైద్య విధానాలు వాడుకలోకి వచ్చాయి. వాటిలో కొన్ని...

### అల్లోపతీ వైద్యం

అల్లోపతీ వైద్యాన్ని నవీన వైద్య విధానం అని అంటారు. ఈ వైద్య విధానంలో జబ్బుపడిన వ్యక్తి బాధలను అణిచివేయడానికి రసాయనిక పదార్థాలతో తయారు చేసిన మందులను వాడుతారు. హిప్పోక్రేటిస్‌ను పాదర్ ఆఫ్ మెడిసిన్ అంటారు.

### ఆయుర్వేద వైద్యం

పురాతన భారతీయ వైద్య విధానాన్ని ఆయుర్వేదం అని అంటారు. ఆయుర్వేద మందులను ఎక్కువగా మొక్కల నుండి తయారు చేస్తారు. ఈ వైద్య విధానానికి తలవంటి వాడు "ధన్వంతరి" అయితే సుశ్రుతుడు గుండెకాయ, చరకుడు వెన్నెముక లాంటివారు. చరకుడిని ఆయుర్వేద పితామహుడిగా పిలుస్తారు.

### హెూమియోపతి వైద్యం

హెూమోయిస్ పెథోస్ అనే గ్రీకు మాటల నుండి పుట్టిన మాట. తెలుగులో సారూప్య లక్షణ వైద్యం అని అనవచ్చు. ఒక పదార్థం ఏ బాధని కలిగిస్తుందో ఆ బాధని నివారించడానికి అదే పదార్థాన్ని మందుగా వాడాలి అన్నది దీని మూల సూత్రం. దీని పితామహుడు "డా॥ సామ్యూల్ హానిమూన్" అనే జర్మనీ దేశపు వైద్యుడు.

### యునానీ వైద్యం

యునానీ అన్నమాట 'అయోనియా' అన్న గ్రీకు మాటలోంచి వచ్చింది. 'అయోనియా' గ్రీకు దేశానికి మరో పేరు. ఇది గ్రీకు దేశంలో 2వ శతాబ్దంలో పుట్టింది. కాని దీనిని ప్రచారంలోకి తీసుకు వచ్చినది. 9వ శతాబ్దపు పారశీక వైద్యుడు. "హకీమ్ బిన్ సీనా". "హిప్పోక్రెటస్"ను ఈ యునాని వైద్య ప్రక్రియకు పితామహుడని అంటారు. ఇందులో వనమూలికలు, జంతువుల నుండి సేకరించిన పదార్థాలు ఖనిజాలు ఉపయోగిస్తారు.

– ఆరోగ్యం – విజ్ఞానం ఆధారంగా...

తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాదు.

# రాళ్ళాట



**ఎందుకు** : సంఖ్యాభావన, జతపరచడం తెలియడం కోసం

**ఏం కావాలి** : సంఖ్యా కార్డులు, రాళ్లు

**ఎలా చేయాలి** : 1 నుండి 9 వరకు గల సంఖ్యా కార్డులు 2 సెట్లు తీసుకోవాలి. టేబుల్ మీద దూర దూరంగా ఉంచాలి. పిల్లల్ని 2 గ్రూపులు చేసి ఒకరి వెనుక ఒకరిని కూర్చోబెట్టాలి. ఈ రెండు లైన్ల చివర రాళ్లు ఉంచాలి. టీచరు స్టార్ట్ అనగానే రెండు గ్రూపుల నుండి ఒక్కొక్కరు ఒకేసారి వచ్చి సంఖ్యా కార్డు తీసుకొని దానిలో ఎంత సంఖ్య ఉందో అన్నే రాళ్లు తీసుకొచ్చి టీచరు దగ్గర కార్డూ, రాళ్లూ పెట్టాలి. ఏ గ్రూపు తొందరగా 9 కార్డులకు రాళ్లు తెస్తే వారు విజేత. ఐతే ఒకరివెనుక ఒకరు వెళ్లి కార్డు తీసుకోవాలి. గుంపు కాకూడదు.

ఇక్కడ వేగం ముఖ్యం కాబట్టి టీచరు జాగ్రత్తగా లెక్కిస్తూ ఉండాలి. పిల్లలు లైనులో వచ్చేలా చూసుకోవాలి. రాళ్ల కుప్ప దగ్గర రద్దీ లేకుండా చూడాలి.

**చర్చ** : రాళ్లను తొందరగా లెక్కించవచ్చా? పెన్నులు తొందరగా లెక్కించవచ్చా? ఇంకా తొందరగా లెక్కించాలంటే ఏమి చేస్తావు? నీ చేతిలో ఎన్ని చాక్లెట్లు పడతాయి?

## జోక్స్

పరీక్ష హాలు నుండి బయటికి వచ్చిన హెడ్‌మాస్టర్, అనిల్, సునీల్ పోట్లాడుకోవటం చూసి.

హెడ్‌మాస్టర్ : మీరిద్దరు ఎందుకు పోట్లాడుకుంటున్నారు.

అనిల్ : సార్ ఇతను నా పేపరు చూసి కాపీ కొట్టాడు.

హెడ్‌మాస్టర్ : ఏది కాపీ గొట్టాడు.

అనిల్ : నేను తెల్ల పేపరిస్తే వీడు కూడా అలాగే ఇచ్చాడు.

* * *

గోపి : నాన్నా గోల్కొండ ఎక్కడుంది?

నాన్న : హైదరాబాద్‌లో.

గోపి : అలాగా! అది బొంబాయిలో ఉంటే ఎంత బావున్ను.

నాన్న : ఎందుకురా?

గోపి : మరి నేను బొంబాయిలో ఉందని రాశాగా!

* * *

మాష్టారు : తాజ్‌మహల్ ఎక్కడుందిరా?

సంతోష్ : తెలియదండి.

మాష్టారు : అయితే బెంచీ ఎక్కు.

సంతోష్ : బెంచీ ఎక్కితే కనిపిస్తుందాండి.

* * *

## ఈతరం కోసం కొత్తగా ముస్తాబైన

# "అలనాటి చందమామ కథలు"

పిల్లలు కథలంటే ఎగిరి గంతులు వేస్తారు. ఎవరైనా కథలు చెబితే ఆసక్తిగా వింటారు. అలాంటి ప్రత్యేకతను కలిగి ఉంది కథ. ఏ రకం కథలైనా వినడానికి శ్రద్ధ చూపెడతారు. కేవలం పిల్లలు మాత్రమే కాకుండా పెద్దలు కూడా కథలు అంటే ఇష్టపడతారు. ఒకప్పుడు చందమామ కథలు చాలా ప్రాచుర్యం పొందాయి నెలంతా చందమామ పత్రిక కోసం ఎదురు చూసేవారు. చందమామ కథలు 14 భారతీయ భాషల్లో వెలుగులను పంచింది. ఆనాటి చందమామ కథలు అందమైన బొమ్మలతో అలరించాయి. అప్పటి కథలకు మళ్ళీ ప్రాణం పోసి ఇప్పటి పిల్లల కోసం గొప్పగా అలంకరించి మళ్లీ అందిస్తున్నాడు రచయిత మాచిరాజు కామేశ్వరరావు. నేటి కాలానికి అనుగుణంగా అందమైన ముద్రణలతో రంగురంగుల బొమ్మలతో అబాల గోపాలాన్ని అలరించడానికి మళ్లీ పాఠకుల ముందుకు వచ్చింది చందమామ కథలు.




ఎవరి కోపం వారి పాలిట శాపం. కోపంతో జీవితాన్ని దుఃఖమయం చేసుకోకూడదు. జీవితం చాలా చిన్నది. "తన కోపమే తన శత్రువు" అని తెలిపే సందేశాత్మకత కథ "కోపిష్టి మొగుడు". ఈ కథ నేటి కాలపు మనషులకు చక్కగా అన్వయిస్తూ రాసిన కథ

మరొక కథ "అపార్థం". ఇందులో మనం విన్నవి, కన్నవి కొన్ని సందర్భాలలో అపార్థం చేసుకుని మనకు మనమే అల్ల కల్లోలం సృష్టించుకుంటాం. అందుకే నిజాలు తెలుసుకొని మాట్లాడాలి అనే నీతిని ఈ కథలో తెలుసుకుంటారు.

"కట్నాల పిచ్చి" కథలో పెళ్లి చేసుకోవడానికి డబ్బులు కట్నాలు ముఖ్యం కాదు. చదువుకున్న వాళ్ళు కూడా వరకట్నం కోసం ఆశపడుతున్నారు. పెళ్లి చేసుకోవడానికి అందం గుణగణాలు ముఖ్యం అంటూ చక్కటి సందేశాన్ని ఈ కథ అందిస్తుంది.

"ఇద్దరు నిరుద్యోగులు" స్వ శక్తి మీద నమ్మకం ఉంటే ఏదో ఒక ఉద్యోగం దొరుకుతుంది. సంపాదించుకున్న ఉద్యోగం నిలబెట్టుకోగల ఆత్మవిశ్వాసం ఎంతైనా అవసరమనే విషయం తెలుసుకుంటాం. ఇలా 45 కథల గురించి చెప్పుకుంటూ పోతే దేనికి ప్రత్యేకత దానికే ఉంది.

నిజ జీవితానికి అనువదిస్తూ చంద మామ కథలు ఆద్యంతం ఆసక్తికరంగా ఉన్నాయి. అందరినీ అలరించే కథలు ఇవి. ప్రతి ఒక్కరు చదవాల్సిన పుస్తకం. ప్రతి విద్యార్థి చేతిలో ఉండాల్సిన నీతి కథలు ఇవి. చందమామ కథలు మొత్తం 45. ఇందులో పేజీల సంఖ్య 144. పుస్తకం ధర 400 రూపాయలు పుస్తకం ముఖ చిత్రం అందంగా ఆకర్షణీయంగా చదవాలనే ఆసక్తిని పెంచేటట్లు ఉంది. ప్రతి కథకు అందమైన బొమ్మలను అందించారు. ఇలాంటి మరెన్నో కథలు మాచిరాజు కామేశ్వరరావు అందించాలని కోరుకుంటూ వారికి హృదయపూర్వక అభినందనలు తెలియజేద్దాం

– యాడవరం చంద్రకాంత్ గౌడ్

m : 9441762105

పక్షి

# పెలికాన్



పెలికాన్ ఒక అద్భుతమైన పక్షి!

పెలికాన్ సాధారణంగా తెల్లగాను, గోధుమ రంగులోను ఉంటుంది. దీని ముక్కు పొడవు 45 సెంటీ మీటర్లు. పక్షి సుమారు 3 మీటర్ల పొడవుంటుంది. ఇది గాలిలో ఎగరగలదు. నీటిలో ఈదగలదు. నీటిలో ఈదటానికి వీలుగా ఈ పక్షుల కాలి వేళ్ళు నాలుగు చర్మంతో కప్పబడి బాతు కాళ్ళలాగా ఉంటాయి. వీటి కాళ్ళు చిన్నవిగా ఉంటాయి. ఈ పక్షి జాతిని 'టోటిపాల్ మేట్ స్విమ్మర్స్' అంటారు.

పెలికాన్ పక్షులను గురించి చెప్పుకోదగిన వింత వీటి గొంతులో ఉండే సంచీ! ఈ సంచీలో మూడు గాలన్ల నీరు పడుతుంది. వీటి ముఖ్య ఆహారం చేపలు. ఇది నీటికి సమాంతరంగా ఎగురుతూ నీటిలో మునిగి చేపను నీటితో సహా గొంతులోని సంచీలోకి మింగి, బయటికి వచ్చి ముక్కును సవరించుకుంటూ సంచిలో నుంచి నీళ్లను ఒంపేస్తుంది. ముక్కుపైకి ఎత్తి గొంతులో ఉన్న చేపను అతి చాకచక్యంగా మింగేస్తుంది.

పెలికాన్ పక్షులు చాలా బలమైనవి. ఇవి బాగా ఈదగలవు. ఎంతటి గాలి విసురులోనైనా సులువుగా ఎగరగలవు. సాధారణంగా పెలికాన్ పక్షులు గుంపులు గుంపులుగా ఎగురుతూ ఉంటాయి. ఇవి గాలిలో హఠాత్తుగా మొగ్గలు వేయడం, పల్టీలు కొట్టడం చేస్తాయి. వీటి అరుపు చాలా కర్కశంగా ఉంటుంది.

ఇవి సంఘజీవులు. తీర ప్రదేశాలలోని చిన్న పొదాలలో, నేలపైన గూళ్ళు ఏర్పరుచుకుంటాయి. ఆడపక్షి, మగపక్షి రెండూ కలిసి గూడు కడతాయి. సముద్రాలలో దొరికే కలుపు, కర్ర ముక్కలు, చిన్న కొయ్యముక్కలు మొదలైన వాటితో ఇవి గూటిని నిర్మించుకుంటాయి. వీటి గుడ్లు ఎరుపు, నీలం కలిసిన రంగులో ఉంటాయి. గుడ్డు నుంచి పిల్ల వచ్చి అది కాస్త పెద్దది అయ్యేవరకు మగపక్షి, ఆడపక్షి చేపలను తెచ్చి చిన్న చిన్న ముక్కలుగా చేసి పిల్లలకు తినిపిస్తాయి.

ఇవి ప్రతీ సంవత్సరం శీతాకాలంలో మన దేశం లోని పులికాట్ సరస్సుకు వలస వస్తాయి. పెలికాన్స్ అన్నీ ఈ సరస్సు ఒడ్డున వరసగా నిలబడి, సరస్సులోని నత్తలను, చేపలను తింటూ ఉంటాయి. పెద్ద గుంపుగా జీవనం సాగించే ఈ పక్షులు ఒక్కసారిగా గాలిలోకి లేస్తాయి. అంతవరకు తెల్లటి మంచు కుప్పలా ఉండే ఈ పక్షులు ఎగరగానే, వాటి రెక్కల కింద ఉండే ఎరుపు, రోజా రంగుల మిశ్రమ వర్ణం కంటికి ఇంపుగా కనిపిస్తుంది. ఆకాశంలో, ఎర్రటి రోజా పువ్వుల తివాచీ పరిచినట్లు యెంతో అందంగా ఉంటుంది.

– బాలచెలిమి

ఫిబ్రవరి 1991, బాలచెలిమి కథల సంచిక నుండి

# చందమామ రావె - జాబిల్లి రావె

చందమామ రావె - జాబిల్లి రావె
కొండెక్కి రావె - గోగుపూలు తేవె
బండెక్కి రావె - బంతిపూలు తేవె
తేరు మీద రావె - తేనె పట్టు తేవె
పల్లకిలో రావె - పాలు పెరుగు తేవె
ఆడుకుంటు రావె - అరటిపండి తేవె
అన్నింటిని తేవె - మా అబ్బాయి కియ్యవె





# చిట్టి చిలకమ్మా?

చిట్టి చిలకమ్మా?
అమ్మ కొట్టిందా?
తోటకెళ్ళావా?
పండు తెచ్చావా?
గూట్లో పెట్టావా?
గుటుక్కుమని మింగావా?



- బాలచెలిమి

వ్యాసం

# మానవత్వం



నా దృష్టిలో సంపదలు అంటే మేడలు, మిద్దెలు, ధనము, చదువు, వాహనాలు కాదు. త్యాగబుద్ధితో, సహన బుద్ధితో సాటి మనిషికి సాయ పడటమే మానవత్వం. సమాజంలో సేవ చేయటం అంటే అది సమానత్వం కొరకే సేవ చేయాలి. ఎవరికి వారు ఒకే స్వచ్ఛంద భావనతో, త్యాగబుద్ధితో సమాజ సేవ ఒక అదృష్టంగా భావించాలి. మనిషికి మంచి హృదయం ఉండాలి. అలాంటి మంచి హృదయంతో ఎటువంటి మేడలు, మిద్దెలు, వాహనాలు, అధికారాలు, పదవులు, చతుర సంభాషణ, నైపుణ్యాలు సరిపోవు. మనిషి కవిగా, ఉపన్యాస కుడుగా, విజ్ఞానవేత్తగా, వాహనాలు, పదవులు పొందినా మానవత్వం లేకపోతే వ్యర్థమే కదా!

మనిషి తన తప్పు తాను తెలుసు కోవడం కన్నా గొప్ప ఏదీ లేదు. ఈ కలి యుగంలో కూడా కొంత మంది మంచి మనసు ఉన్న వాళ్ల ఉన్నారు. వారు స్వార్థభావన వీడి త్యాగనిరతితో సేవలు చేస్తున్నారు.

ఒక మంచి జీవితానికి పదవులు, అధికారాలు, ఆలోచనలు, ఎత్తుగడలు అవసరం లేదు. నిర్మలమైన హృదయం ఉండి ఇతరులకు సేవ చేసి ఉపకారం చేసే స్వభావం ఉంటే చాలు.

భరత భూమి కర్మభూమి, వేద భూమి. ఇటువంటి దేశములో ప్రజలు నిత్యం శాంతి వచనాలు వల్లె వేస్తారు. గౌతమ బుద్ధుడు, బాపూజీ వంటి మహనీయులు జన్మించి, అపారమైన ప్రేమ, దయ అనే గుణాలను విలసిల్లేటట్లు చేసారు.

భగవంతుడు ఉన్నాడు, లేదు అనే ప్రసక్తి ఎందుకు? ఈ భూమిపై గల ప్రజలకు సమానత, సోదర భావము ఉంటే చాలు. ప్రపంచమే భగవన్మయం అవుతుంది.

మానవత్వం అంటే అదేదో తెలియలేని భావన కాదు. మంచీ చెడుల విచక్షణ తెలుసుకోవడం సయోధ్యగా ఉండటం కలిసి జీవించడం.

ప్రజలు మానవత్వం పై అనురాగాన్ని చూపించాలి. అంటే "మనిషి లోని నైపుణ్యాన్ని గౌరవించాలి" అలాగే పరుల దుఃఖానికి స్పందించే సహృదయము, కులమతాలను వదిలి వేయడం, మంచిని గుర్తించే ధీశక్తి ఉండాలి.

ఈ ప్రపంచంలో అనేక కళలు, విజ్ఞానములు, మేధస్సులు అభివృద్ధి చెందాయి. అయితే వీటితోపాటు మనసు యొక్క ఆలోచనలు అభివృద్ధి చెందకుంటే ఎంత అభివృద్ధి చెందినా శూన్యమే కదా!

మనం ఇతరుల హృదయాలను కట్టుబాట్ల వల్ల, మంచి మాటల వలన గెలవవచ్చు కాని మన గుండె తెరుచుకోవాలంటే మంచి మనసు కావాలి కాని గొప్ప తెలివి తేటలు కాదు.

– టి. హన్సిక
8వ తరగతి, ఆక్స్‌ఫర్డ్ గ్రామర్ స్కూల్

# అంతరిక్ష విజ్ఞానం

ప్ర : ఇస్రో ఎప్పుడు ఏర్పడింది?

**జ : ఇస్రో 1969 ఆగస్టు 15న ఏర్పడింది.**

ప్ర : ఇస్రో ప్రధాన కార్యాలయం ఎక్కడ ఉంది?

**జ : బెంగళూరు**

ప్ర : విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంట్ (విఎస్ఎస్‌సి) ఎక్కడ ఉంది?

**జ : తిరువనంతపురం**

ప్ర : ఇస్రో ప్రయోగ వాహనాలను ఎక్కడ తయారు చేస్తుంది?

**జ : విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్ తిరువనంత పురం.**

ప్ర : ఇస్రో శాటిలైట్ సెంటర్ (ఐఎస్ఏసి) ఎక్కడ ఉంది?

**జ : బెంగుళూరు**

ప్ర : సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ (ఎస్‌డిఎస్‌సి) (ఎస్‌హెచ్ఎఆర్) ఎక్కడ ఉంది?

**జ : శ్రీహరికోట**

ప్ర : స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ (ఎస్ఎసి) ఎక్కడ ఉంది?

**జ : అహ్మదాబాద్**

ప్ర : నేషనల్ రిమోట్ సెన్సింగ్ సెంటర్ (ఎన్ఆర్ఎస్‌సి) ఎక్కడ ఉంది?

**జ : హైదరాబాద్**

ప్ర : ఫిజికల్ రీసెర్చ్ లాబొరేటరీ (పిఆర్ఎల్) ఎక్కడ ఉంది?

**జ : అహ్మదాబాద్**

ప్ర : నేషనల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చ్ లాబొరేటరీ (ఎన్ఎఆర్ఎల్) ఎక్కడ ఉంది?

**జ : తిరుపతి సమీపంలోని గడంకి**

ప్ర : షార్ నుండి మొట్టమొదటి సౌండింగ్ రాకెట్ ఎప్పుడు ప్రయోగించబడింది?

**జ : 1963 లో**

ప్ర : భారతదేశ అంతరిక్ష కార్యక్రమ పితామహుడు ఎవరు?

**జ : విక్రమ్ సారాభాయ్**

ప్ర : భారతదేశం ప్రయోగించిన మొదటి ఉపగ్రహం ఏది?

**జ : ఆర్యభట్ట (19 ఏప్రిల్, 1975)**



ప్ర : స్కైలాబ్ అంటే ఏమిటి?

**జ : స్కైలాబ్ యునైటెడ్ స్టేట్స్ మొదటి స్పేస్ స్టేషన్. ఇది జూలై 11, 1979న వాతావరణంలో విచ్ఛిన్నమైంది. హిందూ మహాసముద్రం, పశ్చిమ ఆస్ట్రేలియా అంతటా శిథిలాలను వెదజల్లింది.**

ప్ర : భాస్కర 1 ఉపగ్రహాన్ని ఎప్పుడు ప్రయోగించారు?

**జ : 7 జూన్ 1979**

ప్ర : శాటిలైట్ లాంచ్ వెహికల్-3 (ఎస్ఎల్‌వి-3) ని ఎప్పుడు విజయవంతంగా ప్రయోగించారు?

**జ : 18 జూలై 1980**

ప్ర : రోహిణి ఉపగ్రహం-1 (ఆర్ఎస్-1)ని ఎప్పుడు ప్రయోగించారు?

**జ : జూలై 18, 1980**

ప్ర : ఇన్సాట్-1ఎని ఎప్పుడు ప్రయోగించారు?


**జ : ఏప్రిల్ 10, 1982**

ప్ర : ఆర్ఎస్-డి2 ఎప్పుడు ప్రారంభించబడింది?

**జ : ఏప్రిల్ 17, 1983**

**– ఆరోగ్యం-విజ్ఞానం**

తెలంగాణ సారస్వత పరిషత్ ఆధారంగా..



# పిచ్చుక పిల్ల

ఒక చెట్టు కొమ్మపైన పిచ్చుక, పిచ్చుక తల్లి ఉన్నాయి. గాలిలో ఎగురుతున్న గాలి పటాన్ని చూసి, 'అమ్మ నాకు గాలిపటం కావాలి' అని గోల గోల చేసింది.

అప్పుడు పిచ్చుక తల్లి ఉల్లిగడ్డ దగ్గరకు వెళ్ళి, ఉల్లి పొరను తెచ్చింది. సాలెపురుగును అడిగి దారం తెచ్చింది. తుమ్మచెట్టు దగ్గరకు వెళ్ళి బంకను తెచ్చింది. పిచ్చుకతల్లి గాలిపటాన్ని తయారు చేసింది.

పిచ్చుక గాలి పటాన్ని ఆనందంగా ఎగురవేయ సాగింది. ఆ పిచ్చుక, పిచ్చుక తల్లి ఆ గాలిపటాన్ని చూస్తూ చాలా సంతోష పడ్డారు.

– యు. బాల్‌రాజ్
8వ తరగతి, ప్రభుత్వ ఉన్నత పాఠశాల
సీతాఫల్ మండి, హైదరాబాద్


## పుస్తక పరిచయం




ఆరోగ్యం – విజ్ఞానం
తెలంగాణ సారస్వత పరిషత్తు, హైదరాబాద్
m : 9000273224




విద్యా కుసుమాలు
విద్యా హై స్కూల్
m : 9885737992




ప్రియమైన అమ్మకు...
సయ్యద్ షఫీ
m : 9949273063

నాగుపల్లి కథా కందబం
పురిమిళ్ల సునంద
m : 9441815722




ధనమా? జ్ఞానమా?
కంచనపల్లి వేంకట కృష్ణరావు
m : 9348611445




ఏడు రంగుల జెండా
డా. నీరజ అమరవాది
m : 9849160055



## వైరాగ్యం ప్రభాకర్‌కు బాల సాహిత్య పురస్కారం ప్రదానం



సిద్దిపేటకు చెందిన శ్రీ వాణి సాహిత్య పరిషత్తు దశమ వార్షికోత్సవం సందర్భంగా 2024 సంవత్సరానికి గాను 2023 సంవత్సరంలో ప్రచురణ అయిన పుస్తకాలకు బాల సాహిత్య పురస్కారాలను స్థానిక శివానుభవ మంటపంలో వైభవంగా జరిగిన కార్యక్రమంలో విజేతలకు ప్రదానం చేశారు. కరీంనగర్‌కి చెందిన కవి వైరాగ్యం ప్రభాకర్‌కు పెందోట బాలసాహిత్య పురస్కారాన్ని అందించి సత్కరించారు.



బాల సాహిత్యం విభాగంలో కవి, రచయిత, విమర్శకుడు, భవానీ సాహిత్య వేదిక అధ్యక్షుడు వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన బాలగేయ సారస్వతం సంకలనానికి పెందోట బాల సాహిత్య పురస్కారం, నగదుతో పాటు శాలువా మెమెంటోతో సత్కరించారు. నిర్వాహకులు పెందోట వెంకటేశ్వర్లుతో పాటు కార్యక్రమంలో కవి డా.దాశరథుల బాలయ్య, తెరవే రాష్ట్ర అధ్యక్షులు కొండి మల్లారెడ్డి, ఎం.పి.డి.ఓ మాదుగుల మురళీధర శర్మ , కవి ప్రిన్సిపాల్ ఎస్ దబ్ల్యు డి సి ఎర్రోజు వెంకటేశ్వర్లు, జాతీయ సాహిత్య పరిషత్ సిద్దిపేట శాఖ అధ్యక్షులు ఎన్నవెళ్ళి రాజమౌళి, లెక్చరర్ సామ సువర్ణాదేవి, అధ్యక్షులు తెలంగాణ సాహిత్య పీఠం దాసరి శాంతకుమారి, సుగుణ సాహితీ కన్వీనర్ బైతి దుర్గయ్య అతిథులుగా హాజరై విజేతలను అభినందించారు. కుమారి బండోజు శ్రావ్య వ్రాసిన శ్రావ్య శతకమునకు పెందోట బాలసాహిత్య పురస్కారం పొందిన సందర్భంగా సన్మాన కార్యక్రమం జరిగింది.

**– వైరాగ్యం ప్రభాకర్**
కరీంనగర్
m : 9014559059

## కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారం

తేది: 26-06-2024 నాడు హైదరాబాదులోని రవీంద్రభారతిలో కర్క ముత్తారెడ్డి స్మారక పురస్కారం ప్రదానోత్సవం జరిగింది. కర్క ముత్తా రెడ్డి స్మారక పురస్కారం బుచ్చిరెడ్డి అందుకున్నారు. నల్లగొండ జిల్లా కనగల్లు మండలంలోని చిన్న మాధారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆంగ్లోపాధ్యాయుడిగా పని చేస్తున్న ప్రముఖ రచయిత కోమటిరెడ్డి బుచ్చిరెడ్డికి రాష్ట్రస్థాయి కర్క ముత్తారెడ్డి స్మారక కవితా పురస్కారం లభించింది. హైదరాబాద్ లోని రవీంద్ర భారతిలో తెలంగాణ భాషా సంస్కృతిక శాఖ సౌజన్యంతో సామాజిక చైతన్య వేదిక వసుంధర విజ్ఞాన వికాస మండలి 31వ వార్షికోత్సవం సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథి అదనపు జిల్లా కలెక్టర్ ఏనుగు నరసింహారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. రెండు తెలుగు రాష్ట్రాల నుండి వచ్చిన కవితలలో నల్లగొండ జిల్లా నుండి బుచ్చిరెడ్డి రాసిన “మత సామరస్యం” అనే కవిత ఎంపిక అయ్యింది. ఈ కార్యక్రమంలో దక్కన్‌ల్యాండ్, బాల చెలిమి సంపాదకులు వేదకుమార్ మణికొండ, సంస్థ వ్యవస్థాపకులు వైద్యుల మధుకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి బాలాచారి, నాళేశ్వరం శంకరం, కోట్ల వెంకటేశ్వర్ రెడ్డి,



ఒద్దిరాజు ప్రవీణ్ కుమార్, పొత్తూరి సీతా రామరాజు, పరంజ్యోతి, కోట కుమార్, జక్కుల దామోదర్, చదువు వెంకట్ రెడ్డి, మమతా కులకర్ణి తదితరులు పాల్గొన్నారు. బుచ్చిరెడ్డికి పురస్కారం లభించడం పట్ల పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు పద్మ, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు, కవులు రచయితలు అభినందనలు తెలిపారు.

### 'ఏడు రంగుల జెండా' పుస్తకావిష్కరణ

రవీంద్రభారతి, జూన్ 13: తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో అమరవాది ఫౌండేషన్ సాహిత్య, సాంస్కృతిక సంస్థ నిర్వహణలో గురువారం రవీంద్రభారతిలోని సమావేశం మందిరంలో రచయిత్రి డా. అమరవాది నీరజ రచించిన బాలల కథలు 'ఏడు రంగుల జెండా' పుస్తకావిష్కరణ సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా దక్కన్ లాండ్ చైర్మన్, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్, విశిష్ట అతిథిగా జుర్రు చెన్నయ్య విచ్చేసి పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం అమరవాది హైమావతి, డా.ఏసీఎంఎల్ ప్రసాద్ సాహిత్య పురస్కారం ఆచార్య సి. మృణాళినికి, డా.ఎస్ఎంఎల్ ప్రసాద్ హైమావతి బాల సాహిత్య పురస్కారం గరిపెల్లి అశోక్‌కు అందజేశారు. డా.పత్తిపాక మోహన్ సభాధ్యక్షత వహించిన కార్యక్రమానికి చొక్కాపు వెంకటరమణ, సాహిత్య అకాడమీ కార్యదర్శి డా.ఎన్.బాలాచారి, సాహితీ వేత్త ప్రొఫెసర్ భుజంగరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



### పాఠశాలలో బాల చెలిమి ఆవిష్కరణ



బాల చెలిమి పిల్లల మాస పత్రికలను నల్లగొండ జిల్లా కనగల్ మండలంలోని చిన్న మాదారం పాఠశాలలో విద్యార్థులు ఆవిష్కరించారు. బాల చెలిమిలో వచ్చిన వివిధ అంశాలను చూసిన బాలల ప్రతిస్పందన చాలా బాగుంది. అందులో ఉన్న అంశాలను చూసి చాలా సంతోషపడ్డారు. బాల చెలిమి సంపాదకులు వేదకుమార్ సార్‌కి ధన్యవాదాలు తెలిపారు. ఇక నుండి కథలు, గేయాలు, పర్యావరణం గురించి తాము కూడా రాస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల గెజిటెడ్ ప్రధానోపాధ్యాయురాలు వల్లపట్ల పద్మ, బాల సాహితీవేత్త కోమటిరెడ్డి బుచ్చిరెడ్డి, పావని, వైష్ణవి, నందు, అనూష, పల్లవి తదితర విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యశాల

జాతీయ పఠన దినోత్సవం సందర్భంగా నేషనల్ బుక్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్, భరత్ నగర్‌లోని వివేకానంద్ కాన్వెంట్ హైస్కూలులో కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత 'మాస్టర్ స్టోరీ టెల్లర్' చొక్కాపు వెంకటరమణ పిల్లలకు నిర్వహించిన స్టోరీ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ కార్యశాలలో ముఖ్య అతిథిగా శ్రీమతి ధనదుర్గ, ప్రిన్సిపాల్, వివేకానంద్ కాన్వెంట్ హైస్కూల్ పాల్గొన్నారు.



– సచిన్ కోత్వాల్

బాలచెలిమి డెస్క్, m : 8686664949

# నేనూ నా బాల్యం - తురగా జానకీ రాణి

తురగా జానకీరాణి స్వంత ఊరు కృష్ణా జిల్లాలో అవనిగడ్డ సమీపంలో మందపాకల గ్రామం, ఆవిడ పుట్టింది బందరులో. తాను పుట్టే సమయానికి దేశానికి ఇంకా స్వాతంత్ర్యం రాలేదని చెప్తారు ఆమె.

“నేను పుట్టిన దాదాపు పదేళ్లకు స్వాతంత్ర్యం వచ్చింది. మా ఇంట్లో కళలు, నాట్యం, సంగీతం, నాటకం, సాహిత్యంతో పాటు స్వతంత్రం కోసం పోరాటం కూడా రోజువారీ పనిగా ఉండేది. నేను ఎక్కువగా మా అమ్మమ్మగారు దుల్లా వెంకట రమణమ్మ గారి దగ్గర పెరిగాను. మా అమ్మతో పాటు మా ముగ్గురు పిన్నులు, ఒక మేనమామ నన్ను పెంచారు.”



“మా అమ్మమ్మ గారు గొప్ప రచయిత చలం గారి చెల్లెలు. ఆవిడ ఎంతో సృజన కలిగిన మనిషి. ఎంతో సరదా మనిషి కూడా. 1930 లో మహిళా సమాజం స్థాపించి ఆవిడ, బందరులో మహిళలకి ఆటలు, నాటికలు, పోటీలు, పండుగలు, ఉత్సవాలు నిర్వహించే వారు. ఇంట్లో అందరం చక్కగా పాడేవాళ్ళం, నాట్యం చేసేవాళ్ళం. అప్పట్లో స్త్రీలకి వేరే ఆదాయం ఉండేది కాదు కదా. అందుకని మహిళా సమాజంలో సభ్యత్వం కోసం ఎవరైనా రాట్నం మీద నూలు వడికి, అదే ఫీజుగా కట్టవచ్చు అని ఆమె చెప్పేవారు. ప్రభాత భేరీలలో మేము అందరం దేశ భక్తి పాటలు పాడుతూ నగర సంకీర్తనం చేసేవాళ్ళం.”

నాకు ఆరేళ్ళ వయస్సు ఉన్నప్పుడు మహాత్మా గాంధీని చెన్నైలో చూశాను. మా అమ్మ రాజ్యలక్ష్మి నన్ను, తమ్ముడిని తీసుకుని వెళ్ళింది. గబుక్కున జనాల మధ్యనుంచి దూరి వెళ్లిపోయి, నా వేలికి ఉన్న బంగారు ఉంగరం ఆయనకు ఇచ్చేశాను. నా అరచేతిలో పట్టుకున్న ఉంగరాన్ని బాపూ చిటికిన వేలితో తీసుకుని, నా చేతిని ఊపారు. మరపురాని ఘటన అది.

మా తాతయ్యగారు టీచర్. చదువు ముఖ్యమే కానీ, చదువుతో పాటు అన్నీ నేర్చుకోవాలని చెప్పేవారు. ఫెయిల్ కావడం కూడా అలవాటు ఉండాలి, అప్పుడే విజయం విలువ తెలుస్తుంది, ఫెయిల్ అయితే కుంగిపోకూడదు అని మా అమ్మమ్మ, తాతయ్య చెప్పేవారు అంటే ఊహించండి మా బాల్యం ఎంత నిశ్చింతగా, సరదాగా ఉండేదో.

మా ఇంట్లో ఆవులు, ఎడ్లు, ఒక కుక్కపిల్ల, బోలెడు అరటి, కొబ్బరి, మామిడి చెట్లు. పెద్ద లోగిలి. ఇంటి వెనకాల మినర్వా టాకీస్... అది ఒకసారి పెద్ద మంటలు వచ్చి తగలబడితే, మా అమ్మమ్మ హడావిడిగా లేపిందిట. రోజురోజూ టాకీసులు తగలబడడం పిల్లలు ఎక్కడ చూస్తారు అని. బ్యాంకు బంట్రోతు కాంతయ్య గురించి, పాట, కథలు, త్యాగరాయ కీర్తనలు, బుర్ర కథలు... మారు వేషాలు... ఒకటా.. ఎన్నో...

నాగాయలంక దగ్గర మందపాకల మా నాన్నగారి ఊరు. మా తాతగారు శ్రీరాములు గారు, బామ్మ జానకమ్మలు ఊరు ఊరంతటినీ కంటికి రెప్పలా కాసుకునేవారు. మా బంగారు బాల్యానికి వారి ప్రేమ పునాది, ప్రేమతో అంత మంది పెద్దవాళ్ళు పెంచి, నా వ్యక్తిత్వాన్ని మలచినందుకు నేను తర్వాత, పెద్దయ్యాక కూడా ఎంతో ధైర్యంగా నేను నమ్ముకున్న సిద్ధాంతాల ప్రకారం, తల ఎత్తుకుని ఠీవిగా జీవించాను. పిల్లలకు చదువుతో పాటు ధర్మం నేర్పాలి అన్న పాఠం నా బాల్యం నుంచి నేర్చుకుని, నా పిల్లలను పెంచడంలో కూడా పాటించాను.

– తురగా వసంత శోభ



m : 98480 35124

# CENTRAL BOOKS

SINCE 1947

**Your trusted Academic Partner - Then, Now & Forever**

## DIAMOND JUBILEE

**CELEBRATING 75 YEARS OF KNOWLEDGE, TRUST & LEADERSHIP**



| 12 lakhs + Customers | 700+ Schools | 15 Business Awards | Online Services | Digital Learning | Books and Stationery Supplies |
|---|---|---|---|---|---|

**Head Office :** 6-3-553,C1, Quena Square, Erramanzil, Somajiguda, Hyderabad. Tel: 040-24098282

Regd. Office : Central Book Shop #5-9-186, Chapel Road, Abids, Hyderabad.

Warehouses: Plot No. P9/20, Sy. No. 81, IDA, Nacharam, Uppal Mandal, Medchal, Malkajgiri Dist.
Plot No: 1/5B, TSIIC Industrial Development Area, Nacharam, Medchal Dist., Hyderabad.

www.centralbooks.in

RNI Regn. No. 52828/92 TC No. TEL Tel01232




Edited, printed, published and owned by Manikonda Vedakumar,
Printed at Deccan Press, H.No.1-9-1126/B, Azamabad, Musheerabad, Hyderabad-500020, Telangana State.
Published at "CHANDRAM", # 3-6-712/2, 12th Street, Himayatnagar, Hyderabad-500029, Telangana.
Editor: Manikonda Vedakumar. RNI Reg No. 52828/92, Tc No: TEL Tel01232.
Cell : 9030626288, Mail ID : edit.chelimi@gmail.com